RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER


hyderabadestate.co.in

సంపుటి : 13 సంచిక : 244 | గురువారం, ఫిబ్రవరి 12 2026 | ఎడిటర్ : బట్టు లక్ష్మినారాయణ, | పేజీలు : 6 వెల : రూ. 5.00

Hyderabad, Vijayawada, Vishakapatnam Tirupathi, Ananthapuram,Guntur,Nellor,Ongole,kadapa, Medak, Sangareddy, Siddipet, Nalagonda, Karimnagar,


## అసెంబ్లీలో సబ్జక్ట్‌పై అవగాహనతో రావాలి

**● ఆవు కథలు చెప్పి తప్పించుకోరాదు ● ప్రతిరోజూ అటెండెన్స్ ఉండాల్సిందే ● ఎమ్మెల్యేలకు సిఎం చంద్రబాబు సూచన**



**అమరావతి,ఫిబ్రవరి 11 :** వ్యక్తిగత కక్షల ప్రస్తావనకు అసెంబ్లీని వేదికగా చేసుకోవద్దని కూటమి ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు సూచించారు. సమస్యలను చర్చించి సిద్ధంగా ఉండాలన్నారు. సబ్జక్ట్‌పై ప్రిపేర్ రావాలని అన్నారు. ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 నెలలుగా కూటమి నేతల ఐక్యత కొనసాగుతోందని చెప్పారు. కింది స్థాయిలోనూ ఇదే పరిస్థితి ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో 3 పార్టీల నేతలు సమావేశాలు పెట్టుకుంటూ ఐక్యత పెంచుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేల పనితీరుపై అసెంబ్లీ మిగతా2లో...

## మూడు కార్పోరేషన్లుగా హైదరాబాద్






**జలమండలి పరిధి విస్తరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు**

**జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్**

**హైదరాబాద్,ఫిబ్రవరి 11 :** జలమండలి పరిధిని విస్తరిస్తూ తెలంగాణ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్‌ఎంసీతో పాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సీఎంసీ), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసీ)గా విభజించింది. ఈ క్రమంలోనే మూడు కార్పొరేషన్లకు కమిషనర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్ కొనసాగు తుండగా.. సైబరాబాద్‌కు శ్రీజన, మల్కాజ్‌గిరి వినయ్ కృష్ణారెడ్డిలను రాష్ట్ర సర్కార్ నియమించింది. కాగా.. ఓఆర్ఆర్ పరిధిలో నీటి సరఫరా, సివరేజ్ నిర్వహణను జీహెచ్‌ఎంసీ నుంచి జలమండలికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నీటి సరఫరా, మురుగు వ్యవస్థలతో పాటు సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధిని కూడా జలమండలి చేపట్టనుంది. నీటి సరఫరా, మురుగు వ్యవస్థలతో పాటు సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధి కూడా చేపట్టనుంది. మల్కాజ్‌గిరి జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎస్.పంకజ, హైదరాబాద్ ఈడీగా సామ్రాట్ అశోక్, సైబరాబాద్ ఈడీగా ఎం.సంతోష్, లోక్‌భవన్ జాయింట్ సెక్రటరీగా కె.శశి కిరణాచారిలను రాష్ట్ర సర్కార్ నియమించింది. అలాగే.. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్‌లతో కలిపి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసింది. ఎల్‌బీ నగర్, ఉప్పల్, మల్కాజిగిరి జోన్ ప్రాంతాలతో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయగా.. సికింద్రాబాద్, ఖైరతాబాద్, గోల్కొండ, చార్మినార్, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్‌లతో జీహెచ్‌ఎంసీని విభజించింది. ప్రస్తుతం 1450 చదరపు కిలోమీటర్ల మేర మంచినీటి సరఫరాతో పాటు 650 చ.కి.మీ.ల మేర సివరేజ్ నిర్వహణ చేస్తున్న జలమండలి.. ఇక నుంచి 2,053 చ.కి.మీ. మేర మంచినీటి సరఫరాతో పాటూ సివరేజ్ నిర్వహణ చూడనుంది. కొత్తగా అవసరమైన ప్రాంతాల్లో సీవరేజ్ ట్రీట్మెంట్ ఎ÷-లాంట్లు నిర్మించేందుకు జలమండలి చర్యలు తీసుకోనుంది. జీహెచ్‌ఎంసీని మొత్తం 6 జోన్లు, 30 సర్కిళ్లు, 150 వార్డులుగా ప్రభుత్వం విభజించింది. శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్‌లను జోన్లుగా నిర్ణయించింది. ఆయా జోన్ల పరిధిలో సర్కిళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. శంషాబాద్ జోన్: ఆదిభట్ల, బడంగ్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్. చార్మినార్ జోన్: సంతోష్ నగర్, యాకత్‌పురా, మలక్‌పేట, చార్మినార్, మూసారాంబాగ్. ఖైరతాబాద్ జోన్: మిగతా2లో...

## వందేమాతర గీతం ఇక తప్పనిసరి

**జనగణమన కంటే ముందే వందేమాతరం**

**ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 11 :** అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు, పాఠశాలల్లో ఇక నుంచి జాతీయ గీతం జనగణమన కంటే ముందుగా జాతీయ గేయం వందేమాతరం ఆలపించడాన్ని కేంద్రం తప్పనిసరి చేసింది. ఈ మేరకు మిగతా2లో...

## మున్సిపోల్స్‌పై పీపుల్స్ పల్స్ సర్వే




- అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు
- 7 కార్పోరేషన్లలో 5 కాంగ్రెస్, 2 బిజెపి గెలుపు
- పలుచోట్ల ఎంఐఎం కీలకం కానుందని వెల్లడి

**హైదరాబాద్,ఫిబ్రవరి 11 :** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు కోలాహలం ముగిసింది. ఉదయం నుంచీ సాయంత్రం వరకూ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు తరలివెళ్లారు. మిగతా2లో...

## అమెరికాకు తలొగ్గిన భారత ప్రభుత్వం

**● వాణిజ్య ఒప్పందంతో అమెరికాకే లాభం ● ఎన్‌స్టీన్ ఫైల్స్‌లో అనిల్ అంబానీ, హర్దీప్ పురిల ప్రస్తావ ● బడ్జెట్ చర్చలో రాహుల్ విమర్శలు ● రాహుల్ వ్యాఖ్యలపై గందరగోళం**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 11 :** అమె రికా ప్రభుత్వానికి భారత్ తలొగ్గిందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇరు దేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం అమెరికాకు మేలు కలిగించేలా ఉందే తప్ప.. భారత్‌కు దీనివల్ల ఎలాంటి ప్రయోజనమూ లేదన్నారు. కేంద్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ లోక్‌సభలో మాట్లాడారు. తన ప్రసం గంలో వాణిజ్య ఒప్పందంతో పాటు ఏఐ ప్రభా వం వంటి అంశాల గురించి ప్రస్తావించారు. ప్రపంచంలో మారుతున్న మిగతా2లో...

## మున్సిపోల్స్‌లో రేవంత్ రెడ్డి అధికార దుర్వినియోగం

**- ఎక్స్ వేదికగా కెటిఆర్ తీవ్ర ఆరోపణలు**



**హైదరాబాద్,ఫిబ్రవరి 11 :** మున్సిపల్ ఎన్నికల వేళ అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ఈ క్రమంలో గులాబీ పార్టీ శ్రేణులను ఉద్దేశిస్తూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామరావు ఆసక్తికర ట్వీట్ చేశారు. అలానే అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ రేవంత్ రెడ్డి పై కేటీఆర్ ఫైర్ అయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ ఎన్ని అరాచకాలు చేసినా వీరోచితంగా పోరాడిన గులాబీ సైనికులందరికీ పేరుపేరునా హృదయపూర్వక అభినందనలు. ఆదిలాబాద్ నుంచి ఆలంపూర్ వరకూ మిగతా2లో...

## ఓటేసిన పలువురు ప్రముఖులు

- కొడంగల్‌లో ఓటేసిన సిఎం రేవంత్
- మధిరలో ఓటేసిన భట్టి విక్రమార్క





2లో

## మార్చి 7 వరకు అసెంబ్లీ సమావేశాలు

**● 14న బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న మంత్రి కేశవ్**

**● 15,16. సెలవులు..17, 18వ తేదీల్లో బడ్జెట్‌పై చర్చ**

**● 24, 25, 26 తేదీల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడాపోటీలు**

**● బిఎసి సమావేశంలో సమావేశాల నిర్వహణపై నిర్ణయం**




**అమరావతి,ఫిబ్రవరి 11 :** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 7 వరకు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నా రు. 14 ఆర్థిక మంత్రి బడ్జెట్ సమర్పిస్తారు. అసె ంబ్లీ సమావేశాల నిర్వహణపై బిజినెస్ అడ్వైజరీ కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది. మార్చి 7వ తేదీ వరకు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతిరోజూ మిగతా2లో...

## కరీంనగర్‌లో ఓటేసిన బండి దంపతులు

**ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్‌కు చిత్తశుద్ధి లేదని వ్యాఖ్య**

**కెసిఆర్‌పై చర్యలకు వెనకాడుతున్నారని విమర్శ**



**కరీంనగర్,ఫిబ్రవరి 11 :** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా జ్యోతినగర్ ఎస్ఆర్ హైస్కూల్లో కుటుంబ సభ్యులతో కలిసి కేంద్రమంత్రి బండి సంజయ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బండి సంజయ్ మరోసారి విరుచుకుపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ ఎవరు చేస్తున్నారో సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్ రెడ్డివి ఊకదంపుడు ప్రసంగాలు మాత్రమే అని ఎద్దేవా చేశారు. మిగతా2లో...

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# మున్సిపోల్స్‌పై పీపుల్స్ పల్స్ సర్వే

(మొదటి పేజీ తరువాయి)

సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసిపోగా.. బూత్ లలో ఉన్న వారికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు. అయితే, ఎన్నికలు ముగిసిన వెంటనే ఎగ్జిట్ పోల్స్ విడుదలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు జరిగిన ఈ పోలింగ్‌లో కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని చాటుకోనుందని పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్ సర్వే వెల్లడించింది. వారి అంచనాల మేరకు మంచిర్యాల, రామగుండం, నల్లగొండ, మహబుబ్ నగర్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లలో కాంగ్రెస్ జోరు ప్రదర్శించింది. కరీంనగర్, నిజమాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లను బీజేపీ కైవసం చేసుకునే అవకాశాలు ఉన్నట్లు వెల్లడించింది. ఈ రెండు మున్సిపల్ కార్పొరేషన్లలో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించనుంది. నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్లలో ఎంఐఎం కింగ్ మేకర్ కానున్నదని వెల్లడించింది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ ఏ ఒక్క మున్సిపల్ కార్పొరేషన్ గెలిచే అవకాశాలు లేవని చెప్పింది. ఉత్తర తెలంగాణలో బీజేపీ తన పట్టును నిరూపించుకోనుందని సర్వే చెప్పింది. కరీంనగర్, నిజామాబాద్ కార్పొరేషన్లలో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించి, వాటిని కైవసం చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయంది. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీకి ఈ ఎన్నికలు కోలుకోలేని దెబ్బ తీసేలా ఉన్నాయని తెలిపింది.. ఒక్క మున్సిపల్ కార్పొరేషన్‌ను కూడా గెలుచుకునే అవకాశం ఆ పార్టీకి లేదని పీపుల్స్ పల్స్ అంచనా వేసింది. నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్ కార్పొరేషన్లలో అధికార పీఠాన్ని నిర్ణయించడంలో ఎంఐఎం కీలక పాత్ర పోషించనుందని సర్వే వెల్లడించింది. 116 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ 36శాతం , బీఆర్ఎస్ 29.7శాతం, బీజేపీ 19.3శాతం ఓట్లను సాధించవచ్చని సర్వే పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ 1210-1290 వార్డులను, బీఆర్ఎస్ 860-930 వార్డులను, బీజేపీ 250-270 వార్డులను గెలుచుకునే అవకాశం ఉందని సర్వే చెబుతోంది. మొత్తంగా చూస్తే, అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన మొదటి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తన పట్టును మరింత పటిష్టం చేసుకోగా, బీఆర్ఎస్, బీజేపీలు తమ ఉనికిని కాపాడుకోవడానికి పోరాడుతున్నాయనే విధంగా సర్వే ఫలితాలు వెలువరించింది రామగుండంలో కాంగ్రెస్ 30-34, బీఆర్ఎస్ 16-20, బీజేపీ 3-6, ఇతరులు 4-7 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. మంచిర్యాలలో కాంగ్రెస్ 39-43, బీఆర్ఎస్ 8-12, బీజేపీ 6-9, ఇతరులు 1-2 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. కొత్తగూడెంలో కాంగ్రెస్ 28-34, బీఆర్ఎస్ 7-9, సీపీఐ 14-16, ఇతరులు 2-4 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. మహబూబ్ నగర్ లో కాంగ్రెస్ 26-30, బీఆర్ఎస్ 18-22, బీజేపీ 6-8, ఎంఐఎం 2-4, ఇతరులు 0-1 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. నల్లగొండలో కాంగ్రెస్ 21-26, బీఆర్ఎస్ 8-12, బీజేపీ 6-10, ఎంఐఎం 2-4, ఇతరులు 1-2 వార్డులు గెలుపొందే అవకాశం. నిజామాబాద్ లో కాంగ్రెస్ 10-16, బీఆర్ఎస్ 2-4, బీజేపీ 26-31, ఎంఐఎం 8-12, ఇతరులు 1-2 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. కరీంనగర్ లో కాంగ్రెస్ 14-16, బీఆర్ఎస్ 10-12, బీజేపీ 24-29, ఎంఐఎం 6-9, ఇతరులు 1-3 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. మొత్తంగా 68-76 మున్సిపాలిటీలను అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోనుంది. 29-36 మున్సిపాలిటీలను ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్, 3-5 బీజేపీ, 0-1 ఎంఐఎం గెలుచుకునే అవకాశం ఉందని పీపుల్స్ పల్స్ తన సర్వే ఫలితాల్లో పేర్కొంది. 116 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీకి 36 శాతం, బీఆర్ఎస్ కు 29.7 శాతం, బీజేపీకి 19.3 శాతం, ఏఐఎంఐకు 2 శాతం ఓట్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని పీపుల్స్ పల్స్ సర్వే తెలిపింది. కాంగ్రెస్ పార్టీ 1210-1290, బీఆర్ఎస్ 860-930, బీజేపీ 250-270, ఏఐఎంఐఎం 35-44, సీపీఐ 12-17, సీపీఎం 10-14, ఇతరులు 90-110 వార్డులు గెలుపొందే అవకాశం ఉందని పీపుల్స్ పల్స్ వెల్లడించింది. దాదాపు 70 శాతం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కాంగ్రెస్ కైవసం చేసుకునే అవకాశం ఉందని సర్వే పేర్కొంది. ముఖ్యంగా మంచిర్యాల, రామగుండం, నల్లగొండ, మహబూబ్ నగర్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లలో కాంగ్రెస్ జెండా ఎగరవేయనుందని సర్వే అంచనా వేసింది.

# కరీంనగర్‌లో ఓటేసిన బండి దంపతులు

(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్‌కు రేవంత్ భయపడుతున్నారా? కేసీఆర్ కుటుంబంపై చర్యలు తీసుకోరా? అని మంత్రి ప్రశ్నించారు. అంతేకాకుండా.. రేవంత్ రెడ్డికి రాజకీయాల మీద ఉన్న శ్రద్ధ.. రైతులపై లేదని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. యూరియా పక్కదారి పడుతున్నా ఏమీపట్టడం లేదా అని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ నేతలు బ్లాక్‌లో యూరియా అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కేంద్రాన్ని విమర్శించడం తప్ప.. రాష్ట్రం ఏం చేస్తోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతు ద్రోహి అంటూ వ్యాఖ్యానించారు. టీవీల ముందు తప్ప.. రైతుల పట్ల బాధ్యత లేదా అని, యూరియా మీద కనీసం సమీక్ష చేయరా అని నిలదీశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ హయాంలో రైతులు గోసపడారని మంత్రి అన్నారు.

# ఎన్నికల అధికారుల తీరుపై ఎంపి ఆగ్రహం



**నిజామాబాద్,ఫిబ్రవరి 11 :** నిజామాబాద్‌లో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ హల్‌చల్ చేశారు. హరిచరణ్ మార్వాడీ స్కూల్ పోలింగ్ కేంద్రంలో పోలీసులు, ఎన్నికల సిబ్బందిపై అర్వింద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ అభ్యర్థిని పోలీసులు బయటకు పంపేశారని, ఎన్నికల సిబ్బంది తమకు సహకరించడం లేదని ఎంపీకి కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎంపీ.. పోలీసులకు వార్నింగ్ ఇచ్చారు. సంగతి చూస్తాను అని పోలీసులను ఉద్దేశించి హెచ్చరించారు. ఈ విషయంపై జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం పంపిన ఎంపీ అర్వింద్.. బీజేపీ అభ్యర్థిని బయటకు పంపిన అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటర్లు భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# మార్చి 7 వరకు అసెంబ్లీ సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం గం.9:00 నుంచి మధ్యాహ్నం గం.1:30 వరకు ఈ సమావేశాలు జరగనున్నాయి. ఈనెల 14న బడ్జెట్ సమావేశం నిర్వహించనుంది. 15, 16న సెలవులు కాబట్టి 17, 18వ తేదీల్లో బడ్జెట్‌పై చర్చ, 18న రాష్ట్ర పద్దుపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వివరణ ఉంటుంది. 19వ తేదీ నుంచి 8 పనిదినాలు, డిమాండ్ల గ్రాంట్లపై అసెంబ్లీ బీఏసీ చర్చించనుంది ఈ నెల 28న శనివారం నాడు కూడా అసెంబ్లీ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగనున్నాయి. మార్చి 1, 2, 3వ తేదీల్లో అసెంబ్లీకి సెలవు దినాలుగా నిర్ణయించింది. మార్చి 6, 7న బడ్జెట్‌పై మరోసారి చర్చించనున్నారు. ఆ తర్వాత అవసరం మేరకు అసెంబ్లీ సమావేశాలను పొడిగించాలా? వద్దా? అనే విషయమై అసెంబ్లీ బీఏసీ నిర్ణయించనుంది. అసెంబ్లీ సమావేశాల్లో రోజూ జీరో అవర్ నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన నిర్వహించిన బీఏసీ సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. 17 రోజులపాటు అసెంబ్లీ కార్యకలాపాలు నిర్వహించను న్నారు. 15 ఆదివారం కాగా.. మహా శివరాత్రి తర్వాత రోజు 16న సెలవు ప్రకటించారు. ఫిబ్రవరి 24, 25, 26 తేదీల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడాపోటీలు నిర్వహించను న్నారు. మార్చి 1, 2, 3 తేదీల్లో అసెంబ్లీకి సెలవు ప్రకటించారు. మార్చి 6న అమరావతిలోనే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించ నున్నారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సమావేశాలు జరగనున్నాయి. ఉదయం 10 గంటలకు ప్రశ్నోత్తరాలు ముగించాలని.. రోజూ జీరో అవర్ నిర్వహించాలని బీఏసీ భేటీలో నిర్ణయిం చారు. డిమాండ్ ఫర్ గ్రాంట్స్‌పై 8 రోజుల పాటు చర్చ జరగనుంది.

ఆరు ఆర్డినెన్స్‌లకు సభ ఆమోదం తెలపనుంది. సమావేశాల సందర్భంగా పలు కీలక చర్చలు, బిల్లుల ఆమోదం జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రభుత్వ విధానాలు, ఆర్థిక ప్రణాళికలపై ప్రతిపక్షం నుంచి తీవ్ర చర్చలు జరిగే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. బడ్జెట్ సమావేశాల మధ్యలో ఎమ్మెల్యేల కోసం ప్రత్యేక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు.
ఫిబ్రవరి 24, 25, 26 తేదీల్లో ఎమ్మెల్యేలకు ఆటల పోటీలు నిర్వహించను న్నారు. సభ్యుల మధ్య స్నేహ పూర్వక వాతావరణం పెంపొందించడమే లక్ష్యంగా ఉన్నట్లు సమాచారం. ఈసారి అసెంబ్లీ సమావేశాలు రాజకీయంగా, పరిపాలనా పరంగా కీలకంగా మారనున్నాయి.

# అమెరికాకు తలొగ్గిన భారత ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

పరిణామాలకు అనుగుణంగా బడ్జెట్ ఏమాత్రం ప్రతిబింబించ లేదన్నారు. ప్రపంచమంతా ఏఐ యుగంలోకి వెళ్తోందని చెబుతున్నారు. దీనివల్ల భారతీయ ఐటీ కంపెనీలు నష్టపోయే ప్రమాదం ఉంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల ఉద్యోగాలకు ప్రమాదం ఉంది. మన దేశానికి ప్రతిభావం తులైన యువతరం పెద్ద ఆస్తి. ఏఐకి ఇంధనమే డేటా.. డేటా లేకుండా ఏఐ ఏమీ చేయలేదు. అమెరికా సూపర్ పవర్‌గా కొనసాగాలంటే భారత్ డేటానే కీలకం. గతంలో అధిక జనాభాను సమస్యగా భావించేవారు.. కానీ జనాభా మనకు అతిపెద్ద ఆస్తి. కానీ మన డేటాను రక్షించుకునేందుకు ఇండియా చర్యలు తీసుకోలేదు. అమెరికా కంపెనీల కోసం ట్యాక్స్ హాలిడే ప్రకటిం చిందని రాహుల్ గాంధీ అన్నారు.మన దేశం ఏ దేశాల నుంచి చమురు కొనుగోలు చేయాలో అమెరికా చెబుతోంది. వాళ్లు చెప్పినట్లు చేయకపోతే 50 శాతం టారిఫ్‌లు వేస్తామని బెదిరిస్తున్నారు. అమెరికా డిమాండ్లకు తలొగ్గి కీలక వ్యవసాయ ఉత్పత్తులకు భారత్ ద్వారాలు తెరిచింది. గతంలో భారత ఉత్పత్తులపై ఒకప్పుడు కేవలం 3 శాతం పన్ను ఉండేది. ఇప్పుడు అది 18 శాతానికి చేరింది. అమెరికా దిగుమతులను 46 బిలియన్ డాలర్ల నుంచి 100 బిలియన్ డాలర్లకు పెంచేశారు. భారత్‌కు ఈ ఒప్పందం ఎలాంటి భరోసా ఇవ్వడం లేదు. డాలర్‌ను రక్షించుకునేందుకు ఈ ఒప్పందం దోహదపడుతోందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఎప్‌స్టీన్ ఫైల్లో ప్రముఖ పారిశ్రామికవేత్త అనీల్ అంబానీ పేరు వచ్చినా.. ఎందుకు జైలులో పెట్టలేదని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించా రు. వ్యాపారవేత్త అనీల్ అంబానీ ఎందుకు జైలులో లేడని నేను అడగాలనుకుంటున్నాను? దీనికి కారణం ఆయన పేరు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉంది. అతన్ని (అనీల్ అంబానీ) ఎప్‌స్టీన్‌కు పరిచయం చేసిన హర్‌దీప్ పూరిని కూడా నేను ఒకటి అడగాలనుకుంటున్నాను. అతన్ని ఎవరు పరిచయం చేశారో నాకు తెలుసు. హర్దీప్ పూరికి అతన్ని ఎవరు పరిచేశారో తెలుసు' అని అన్నారు. పరోక్షంగా రాహుల్ మోడీనుద్దేశించి వ్యాఖ్యానిం చారు. బడ్జెట్‌పై ప్రసంగం సందర్భంగా రాహుల్ గాంధీ ఎప్‌స్టీన్‌ల్స్ గురించి ప్రస్తావన తీసుకురాగా.. స్పీకర్ స్థానం లో ఉన్న జగదాంబికా పాల్ అభ్యంతరం వ్యక్తంచేశారు.అదానీ, అనిల్ అంబానీ, హర్దీప్‌సింగ్ పూరీ పేర్లను ప్రస్తావించడంపై రవిశంకర్ ప్రసాద్ పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. దీంతో రాహుల్ గాంధీ వ్యాఖ్యలను రికార్డులను తొలగించాలని స్పీకర్ ఆదేశించారు. బడ్జెట్ గురించి మాత్రమే మాట్లాడాలని స్పీకర్ సూచించారు. పలుమార్లు రాహుల్ గాంధీ మాట్లాడేందుకు ప్రయత్నించగా.. అధికారపక్ష సభ్యుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అమెరికాకు తలొగ్గి డేటాను, వ్యవసాయాన్ని, ఇంధన రంగాన్ని అమ్మకానికి పెట్టారంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యానించి తన ప్రసంగాన్ని ముగించారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న పిసిసి చీఫ్



**నిజామాబాద్,ఫిబ్రవరి 11 :** పట్టణంలోని సన్ ప్లవర్ హైస్కూల్‌లో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గారు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన గొప్ప వరం ఓటు అని, ఓటింగ్ శాతం పెరిగినప్పుడే సమాజానికి మేలు చేసే నాణ్యమైన నాయకులు వస్తారని పేర్కొన్నారు. నిజామాబాద్ గడ్డపై కాంగ్రెస్ విజయం ఖాయ మని ధీమా వ్యక్తం చేస్తూనే, బీజేపీ మతం పేరు తో ప్రజలను రెచ్చగొట్టాలని చూస్తోందని విమర్శి ంచారు. అభివృద్ధికి పట్టం కట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్య తగా ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# అసెంబ్లీలో సబ్జక్ట్‌పై అవగాహనతో రావాలి

(మొదటి పేజీ తరువాయి)

సమావేశాల సమయంలో మాట్లాడతా. 40 మందిని వ్యక్తిగతంగా పిలిపించుకుని మాట్లాడతా. ఆవు కథలు చెప్పడం మాని స్జబెక్ట్ ప్రిపేర్ అయి సభకు రావాలి. ఎవరేం మాట్లాడుతున్నారో నేనూ నోట్ చేసుకుంటా అని అన్నారు. అసెంబ్లీ జరుగుతున్నప్పుడు ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రతి ఒక్కరూ ఉండాలి. నేను కూడా రోజూ ఉదయం 11 గంటల నుంచి సెషన్ అయ్యే వరకూ అసెంబ్లీలో ఉంటా. సభలో మాట్లాడేది 5 కోట్ల మంది ప్రజలకు జవాబుదారీ అని గుర్తుపెట్టుకోవాలని చంద్రబాబు అన్నారు. అక్కడ ఏం మాట్లాడినా వారి కోసమేనని గ్రహించాలి. అనుకున్న విషయాన్ని 3 నుంచి 7 నిమిషాల్లో మాట్లాడాలి. కూటమి ప్రభుత్వంతో ప్రజలకు జరుగుతున్న లబ్దిని ఎప్పటికప్పుడు చెప్పాలి. రూ.లక్ష కోట్లకు పైగా హైవే పనులు, రూ.90వేల కోట్లకు పైగా రైల్వే పనులు జరుగుతున్నాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో విశాఖ స్టీల్‌ఎ÷-లాంట్ రూ.450 కోట్ల నష్టంలో ఉంది. నష్టాలను అధిగమించి రూ.54 కోట్ల లాభాల్లోకి రావడం శుభపరిణామం. కేంద్ర ప్రాయోజికత కార్యక్రమాలను రాష్ట్రం అందిపుచ్చుకోవాలి. అన్ని మతాలను గౌరవించాలి.. భక్తుల సెంటిమెంట్‌ను దెబ్బతీయకూడదు. జగన్‌కు మతాలపై గౌరవం లేనందునే వైకాపా హయాంలో రామతీర్థం సహా అనేక ఆలయాలపై దాడులు జరిగాయి. తిరుమల శ్రీవారి లడ్డూతో పాటు ఎక్కడ వీలైతే అక్కడ కల్తీకి పాల్పడ్డారు‘ అని చంద్రబాబు అన్నారు.

# వందేమాతర గీతం ఇక తప్పనిసరి

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కొత్త నిబంధలను అమల్లోకి తెచ్చింది. వందేమాతరం ఆలపిస్తున్న సమయంలో అందరూ లేచి నిలబడాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. అంతేకాకుండా అన్ని పౌరపురస్కారాలు ఇచ్చే సమయంలో, రాష్ట్రపతి హాజరయ్యే అన్ని కార్యక్రమాల్లో వందేమాతరం ఆలపించాలని తెలిపింది. అయితే సినిమా హాళ్లలో దీనిని ప్రదర్శించాల్సిన అవసరం లేదని నిబంధనల్లో పేర్కొంది. జాతీయ గీతం, గేయం పాడుతుండగా.. అంతరాయం కలిగించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు. కొత్త నిబంధనల కింద బాధ్యులకు గరిష్ఠంగా మూడేళ్ల జైలుశిక్ష విధించనున్నారు. ఇదిలా ఉంటే.. బంకించంద్ర ఛటర్జీ తొలుత 1875లో వందేమాతరాన్ని రచించారు. తర్వాత తన ఆనంద్‌మఠ్ నవలలో దీన్ని భాగం చేశారు. ప్రస్తుతం కేందప్రభుత్వం 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో తాజా ఉత్తర్వులు వచ్చాయి. అందులో ఆరు చరణాలను పాడాలని కేంద్రం పేర్కొంది. వాటిని 3 నిమిషాల 10 సెకన్లలో ఆలపించాలి. స్వాతంత్య్ర పోరాట సమయంలో ముస్లింలీగ్ అభ్యంతరాల మేరకు.. ఆరు భాగాల్లోంచి ఎలాంటి మతపరమైన ప్రస్తావనా లేని తొలి రెండింటిని మాత్రమే కాంగ్రెస్ స్వీకరించింది. స్వాతంత్య్రానంతరం నెహ్రూ ప్రభుత్వం వివాదంలేని తొలి రెండు భాగాలతో.. వందేమాతరాన్ని జాతీయ గేయంగా ప్రకటించింది.

# ఓటేసిన పలువురు ప్రముఖులు

- కొడంగల్‌లో ఓటేసిన సిఎం రేవంత్
- మధిరలో ఓటేసిన భట్టి విక్రమార్క

**హైదరాబాద్,ఫిబ్రవరి 11 :** మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొడంగల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీల్లో ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రారంభమైంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగిం చుకుంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కొడంగల్ లో ఓటు వేశారు. వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ జడ్పీ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ కు వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన హైదరాబాద్‌కు తిరిగి బయల్దేరారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధిరలో ఓటేశారు. నిజామాబాద్ పట్టణంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కరీంనగర్ పట్టణంలో ఓటేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్.. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనే ఆయుధాన్ని కుటుంబ సభ్యులతో కలిసి వినియోగించుకోవాలని బండి సంజయ్ కోరారు. మంచిర్యాలలోని హైటెక్‌సిటీలో 227వ నంబర్ పోలింగ్ బూత్‌లో మంత్రి వివేక్ వెంకటస్వామి ఓటు వేశారు. కామారెడ్డి పట్టణంలోని 151 పోలింగ్ బూత్ లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపి ధర్మిపురి అర్వింద్ తదితరులు కూడా తమ ఓటు హక్కను వినియోగించుకున్నరు. రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు జరుగుతున్న ఈ పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది.

# భూపాలపల్లిలో లక్ష రూపాయాలు సీజ్

**జయశంకర్ భూపాలపల్లి,ఫిబ్రవరి 11:** మున్సిపల్ ఎన్నికల వేళ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పోలింగ్ కేంద్రం సమీపంలో రూ.లక్ష రూపాయలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 22వ వార్డులోని పోలింగ్ కేంద్రం సమీపంలోని ఒక బండ కింద డబ్బులు దాచి, ఓటర్లకు పంచుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకుల చేతిలో ఉన్న డబ్బును పోలీసులు సీజ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు ఈ డబ్బులను పంచుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. బీఆర్ఎస్ అభ్యర్థి బుర్రా సదానందాన్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, కాంగ్రెస్ ఆరోపణలను బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండిం చారు. పట్టుబడిన సొమ్ముతో తమకెలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కావాలనే రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. నగామలో మున్సిపల్ ఎన్నికలో నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందని ఓటర్లు ఆరోపిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద సరైన ఏర్పాట్లు చేయలేదని వాపోతున్నారు. వృద్ధుల కోసం వీల్ చైర్ కూడా ఏర్పాటు చేయకపోవడంతో వారిని చేతులపైనే మోసుకెళ్లాల్సి వస్తుంది.

# మూడు కార్పోరేషన్లుగా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, బోరబండ, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట. రాజేంద్రనగర్ జోన్: రాజేంద్రనగర్, అత్తాపూర్, బహదూర్‌పుర, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట, జంగమ్మెట్, గోల్కొండ జోన్: గోషామహల్, కార్వాన్, గోల్కొండ, మెహిదీపట్నం, మాసాబ్ ట్యాంక్. సికింద్రాబాద్ జోన్: కవాడిగూడ, ముషీరాబాద్, అంబర్‌పేట్, తార్నాక, మెట్టుగూడ

# మున్సిపోల్స్‌లో రేవంత్ రెడ్డి అధికార దుర్వినియోగం

(మొదటి పేజీ తరువాయి)

పురపాలక సమరంలో మీరు కనబరిచిన పోరాట స్ఫూర్తి బీఆర్ఎస్‌కు కొండంత బలాన్నిచ్చింది. పార్టీలో ఆకాశమంత ఆత్మవిశ్వాసాన్ని నింపింది. రెండేళ్ల పాలనలో ఘోరమైన పరిపాలనా వైఫల్యాలను మూటగట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్.. ఓటమి భయంతోనే ఈ ఎన్నికల్లో ఇంతటి దౌర్జన్య కాండకు దిగారు. కాంగ్రెస్ పార్టీకి పంచాయతీ ఎన్నికల్లో మొదలైన పరాభవం, పట్టణాల్లోనూ తప్పదనే ఆందోళనతోనే అడుగడుగునా రేవంత్ రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు' అని కేటీఆర్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అక్రమంగా లూటీ చేసిన వేలకోట్ల ప్రజాధనంతో ప్రజాతీర్పునే మార్చాలన్న ఈ కుట్రలను తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. పోలీసు శాఖను అడ్డంపెట్టుకుని బీఆర్ఎస్ శ్రేణులపై సాగించిన వేధింపుల పర్వానికి, దాడులకు రేవంత్ రెడ్డి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ప్రజలకిచ్చిన హామీలను, మొత్తంగా పరిపాలనను గాలికి వదిలేసి రాష్టాన్ని సంక్షోభంలోకి నెట్టిన పాపం రేవంత్ రెడ్డిని ప్రతినిత్యం వెంటాడుతూనే ఉంటుంది' అంటూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

# వాలెంటైన్స్ డే' ను నిషేధించాలి భారతీయ సంస్కృతి

**- సాంప్రదాయాలకు వాలెంటైన్స్ డే వ్యతిరేకం**

**- బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు**







**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి కాచిగూడ ఫిబ్రవరి 11:**
ఫిబ్రవరి 14న నిర్వహించే 'వాలెంటైన్స్ డే' ను నిషేధించాలని బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడ లోని బజరంగ్ సేన రాష్ట్ర కార్యాలయంలో వాలెంటైన్ డే ను నిషేధించాలని పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు. వాలెంటైన్స్ డే వేడుక యువతలో తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చురుకుగా పర్యవేక్షించాలని, వాలెంటైన్స్ డే జరుపుకోవడం వల్ల కలిగే సాంస్కృతిక చిక్కుల గురించి వారికి అవగాహన కల్పించాలని కోరారు, ఇది భారతీయ విలువలలో పాతుకుపోయిన పాశ్చాత్య సంప్రదాయం కాదని ఆయన అభివర్ణించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటం, ప్రోత్సహించడం యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. పబ్బులు, హోటళ్ళు, మాల్స్, రిసార్ట్‌లు, ఇతర వ్యాపార సంస్థలు వాలెంటైన్స్ డేను వాణిజ్యీకరించడం పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అటువంటి సంస్థలు ప్రధానంగా వాణిజ్య లాభాల కోసం ఈ సందర్భాన్ని ప్రోత్సహిస్తాయని, తన దృష్టిలో భారతీయ సంప్రదాయాలకు విరుద్ధంగా ఉన్న పాశ్చాత్య సాంస్కృతిక పద్ధతుల ప్రభావాన్ని పరిమితం చేయడంపై విస్తృత చర్చకు ఆయన పిలుపునిచ్చారు. యువతను ఉద్దేశించి ప్రవీణ్ యాదవ్ మాట్లాడుతూ.. భారతదేశ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని యువత గర్వించాలని మరియు శివాజీ జయంతి మరియు మహా శివరాత్రి వంటి పండుగలను ఉత్సాహంగా మరియు భక్తితో జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. భారతీయ సాంస్కృతిక విలువలను నిలబెట్టి అనుసరించాలని ఆయన వారిని ప్రోత్సహించారు. సమావేశంలో భజరంగ్ సేన ఉపాధ్యక్షుడు (తెలంగాణ) ప్రభు బిరాదార్, జాయింట్ సెక్రటరీ శ్రీమతి ఆర్తి మహేంద్రకర్, మనోజ్ మొగల్గిడ్డి, ప్రవీణ్ యాదవ్, రామేశ్వర్ మిశ్రా, అజయ్ నాయుడు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఏపి అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి మచ్చ

**- వైసీపీ నేతల నినాదాబిలు తీవ్రంగా ఖండనీయం**

**--- రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు డా. పిట్టా వర ప్రసాద్**



**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధిఅమరావతి:ఫిబ్రవరి 11.**
రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమై గవర్నర్ గారి ప్రసంగం కొనసాగుతున్న సమయంలో వైసీపీ నేతలు శాంతి భద్రతలు కాపాడాలని అంటూ, "ఇదేమి రాజ్యం, దొంగల రాజ్యం" అంటూ నినాదాలు చేయడం ఎంతవరకు సమంజసమని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు డా. పిట్టా వర ప్రసాద్ తీవ్రంగా ప్రశ్నించారు.అసెంబ్లీ అనేది ప్రజల సమస్యలపై చర్చించడానికి, ప్రజాస్వామ్య పద్ధతుల్లో అభిప్రాయాలు వెల్లడించడానికి ఏర్పాటైన అత్యున్నత వేదిక అని ఆయన పేర్కొన్నారు. అలాంటి సభలోనే శాంతిగా ఉండలేని వారు, రాష్ట్ర ప్రజల సమస్యలపై చర్చించలేని వారు, కేవలం నినాదాలు చేసి గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకోవడమే లక్ష్యంగా వ్యవహరించడం దురదృష్టకరమని విమర్శించారు.రాజ్యాంగ పరంగా గవర్నర్ ప్రసంగానికి ఉన్న గౌరవాన్ని కాలరాస్తూ, ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కేలా వైసీపీ నేతల ప్రవర్తన ఉందని డా. పిట్టా వర ప్రసాద్ అన్నారు. ఇది శాసనసభా సంప్రదాయాలకు విరుద్ధమేగాక, రాష్ట్ర ప్రజలకు తప్పుడు సందేశం పంపుతుందని హెచ్చరించారు.ప్రతిపక్షంగా తమ బాధ్యతను నిర్వర్తించాలంటే సభలో చర్చల ద్వారా, వాదనల ద్వారా ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిందే గానీ, నినాదాలు చేసి సమావేశాలను అడ్డుకోవడం ద్వారా కాదు అని ఆయన స్పష్టం చేశారు. ఇటువంటి చర్యల వల్ల ప్రజల విశ్వాసం దెబ్బతింటుందని, ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకం క్షీణిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.వైసీపీ నేతలు తమ వైఖరిని మార్చుకుని, శాసనసభ గౌరవాన్ని కాపాడేలా వ్యవహరించాలని డా. పిట్టా వర ప్రసాద్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు, ప్రజల సమస్యలపై సార్థక చర్చలు జరగాలంటే బాధ్యతాయుత రాజకీయాలు అవసరమని ఆయన పిలుపునిచ్చారు.

# కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డిని సన్మానించిన కాలనీవాసులు

**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి 11:-**
కార్పొరేటర్‌గా 5 సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డిని పద్మావతి కాలనీవాసులు ఘనంగా సన్మానించారు.హయత్‌నగర్ డివిజన్ అభివృద్ధి కోసం గత ఐదు సంవత్సరాలుగా నిరంతరం కృషి చేస్తూ, కాలనీలో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజ్, మౌలిక వసతులు ప్రజా సమస్యల పరిష్కారానికి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినందుకు కృతజ్ఞతగా కాలనీ ప్రజలు ఈ సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి, మాట్లాడుతూ, పద్మావతి కాలనీ ప్రజల ప్రేమాభిమానాలు తనకు మరింత సేవ చేయాలనే ప్రేరణనిస్తాయని, భవిష్యత్తులో కూడా కాలనీ అభివృద్ధికి ఎల్లప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, కాలనీ అధ్యక్షులు అమర్నాథ్ గౌడ్ , కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మధు భూపాల్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి , కృపాకర్ రావు, భాస్కర్, సురేష్ రావు, సురేష్ రెడ్డి, రఘుపతిరావు,చంద్ర శేఖర్,



యాదిరెడ్డి, నర్సిరెడ్డి, జయచందర్ వెంకటేశ్వర్లు,వెంకటేశ్వర్ రెడ్డి, బాలాజీ మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# సమాజ అభివృద్ధికి బాటలు వేసేది సుపరిపాలన

**గంట సోమన్న, సీనియర్ జర్నలిస్ట్**

**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి తెలంగాణ.**
సమాజ అభివృద్ధి కైనా మూలస్తంభం సుపరిపాలన (గుడ్ గవర్నన్స్).ఏ సమాజమైనా ఆర్థిక, సామాజిక,సాంస్కృతిక, నైతికత దృష్ట్యా అభివృద్ధి చెందాలంటే, పాలనా వ్యవస్థ బలంగా, న్యాయబద్ధంగా,పారదర్శకంగా పనిచేయాలి.ప్రపంచదేశాల అనుభవాలు,ఐక్యరాష్ట్ర సమితి (యుఎన్),ప్రపంచ బ్యాంకు వంటి సంస్థల అధ్యయనాలు కూడా సుపరిపాలన లేకుండా స్థిరమైన అభివృద్ధి అసాధ్యమని ఒకే విషయాన్ని చెబుతున్నాయి.సుపరిపాలన అంటే ఏమిటి?సుపరిపాలన అంటే కేవలం పాలకులు లేదా అధికారులు ఏదో చేయడం కాదు.అది ప్రజల అవసరాలను తీర్చడం, వనరులను సమర్థవంతంగా వినియోగించడం,న్యాయం అందరికీ సమానంగా అందుబాటులో ఉంచడం వంటివి నిష్పక్షపాతంగా జరగాలి.దీనికి ప్రజలు ముఖ్యంగా మహిళలు, యువత,వెనుకబడిన వర్గాలు భాగస్వామ్యం (పార్టిసిపేషన్) ఉండాలి.నిర్ణయాల తీసుకోవడంలో ఈ వర్గాలు ప్రాధాన్యత కలిగి ఉండాలి.గ్రామ సభలు,పంచాయతీలు,పౌర సంఘాల ద్వారా ఇది సాధ్యమవుతుంది.ప్రభుత్వ ఖర్చులు,నిర్ణయాలు,టెండర్లు అందరికీ తెలిసేలా పారదర్శకంగా (ట్రాన్సపారెన్సీ) జరగాలి.ఆర్టీఐ చట్టం ఇందుకు ఒక ఉదాహరణగా చూడొచ్చు.

దాచిపెట్టే పాలన అభివృద్ధిని అడ్డుకుంటుంది.జవాబుదారీతనం (అకౌంటెబిలిటీ) ద్వారా సుపరిపాలన ఇవ్వొచ్చు. అధికారులు,ఎన్నికైన ప్రజాప్రతినిధులు తమ నిర్ణయాలకు జవాబుదారీ కావాలి.లోక్‌పాల్,కాగ్,ఎన్నికల సంఘం వంటివి దీనికి సహాయపడాలి.సమర్థత మరియు సామర్థ్యం.పాలనా వ్యవస్థలో అన్ని స్థాయిల్లో సమర్థత మరియు సామర్థ్యం(ఎఫెక్టివేనెస్ అండ్ ఏఫిసైన్సీ) పెరగాలి.తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలు ఇవ్వాలి.డిబిటి (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా లీకేజీలు తగ్గి డబ్బు నేరుగా ప్రజల ఖాతాలోకి వెళ్ళాలి.న్యాయబద్ధత మరియు చట్టపాలన (రూల్ ఆఫ్ లా)చట్టం అందరికీ సమానంగా అందాలి. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే శిక్ష పడాలి,అదిపాలకుడైనా,అధికారైనా,సామాన్యుడైనా ఒక్కటే రూల్ ఉండాలి.ఈ విషయంలో స్పందనాత్మకత(రెస్పాన్సివేనెస్)ప్రజల సమస్యలకు త్వరగా స్పందించాలి.సంక్షేమ పథకాలు, విపత్తుల సమయంలో సహాయం వేగంగా అందాలి. సమానత్వం మరియు సమగ్రత

సమాజంలో లింగం,కులం, మతం,ఆర్థికస్థితి ఆధారంగా వివక్ష ఉండకూడదు.అందరూ అభివృద్ధి ఫలితాల్లో భాగస్వాములు కావాలి. దీర్ఘకాలిక దృక్పథంతో ముందుకు పోవాలి.తాత్కాలిక లాభాల కోసం కాకుండా తరతరాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకోవాలి.వివిధ వర్గాల మధ్య ఏకాభిప్రాయం కోసం ప్రయత్నించాలి.భారత దేశంలో డిజిటల్ ఇండియా,ఆధార్ లింక్, యూపీఐ వంటివి పారదర్శకత, సమర్థతను పెంచాయి.స్వచ్ఛ్ భారత్,జల్ జీవన్ మిషన్ వంటివి సమగ్ర అభివృద్ధికి ఉదాహరణలుగా చూడొచ్చు. అయితే అవినీతి,రాజకీయ జోక్యం,న్యాయ వ్యవస్థలో ఆలస్యం వంటివి ఇంకా సవాళ్లుగానే ఉన్నాయి.పాలనా వ్యవస్థ మాత్రమే కాదు అందరి భాగస్వామ్యం ఉండాలి




సమాజ అభివృద్ధి అనేది ప్రభుత్వం ఒక్కటే చేయలేదు. ప్రజలు,సివిల్ సొసైటీ,మీడియా, వ్యాపార సంస్థలు కలిసి పనిచేస్తేనే సాధ్యం.కానీ,ఆ కలయికకు మూలస్తంభం సుపరిపాలన అవుతుంది. సుపరిపాలన ఉన్న చోట నమ్మకం పెరుగుతుంది, పెట్టుబడులు వస్తాయి, ఆవిష్కరణలు జరుగుతాయి, అసమానతలు తగ్గుతాయి. మొత్తం మీద సమాజం సంతోషంగా,సమృద్ధిగా జీవిస్తుంది.సుపరిపాలన కేవలం ఒక భావన కాదు,అది సమాజం బతకడానికి,ఎదగడానికి, వికసించడానికి అవసరమైన ఆక్సిజన్ లాంటిది.

**గంట సోమన్న,సీనియర్ జర్నలిస్ట్.**

# తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలను కించపరచవద్దు

# : కోర్టు వ్యాఖ్యలపై కప్పాటి పాండురంగా రెడ్డి తీవ్ర అభ్యంతరం

**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కేంద్రంలో పాండురంగ రెడ్డి మాట్లాడుతూ...స్వరాష్ట్ర సాధన కోసం పద్నాలుగేళ్ల పాటు సాగిన ఉజ్వల పోరాటంలో తమ జీవితాలను ధారపోసిన తెలంగాణ ఉద్యమకారుల పట్ల గౌరవనీయ హైకోర్టు చేసినట్లుగా వస్తున్న వ్యాఖ్యలు అత్యంత దురదృష్టకరమని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగా రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.
ఈ వ్యాఖ్యలు వేలాది మంది ఉద్యమకారుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.
స్వాతంత్ర్య పోరాటానికి సమానమైన ఉద్యమం తెలంగాణ ఉద్యమం"ఇంటి స్థలం, పింఛను ఇవ్వడానికి మీరేమైనా స్వాతంత్ర్య సమరయోధుల" అని న్యాయస్థానం ప్రశ్నించడం ఉద్యమకారుల త్యాగాలను తక్కువ చేసి చూపడమే. 1969 నుండి 2014 వరకు సాగిన పోరాటం ఆధిపత్య పరాయి పాలన నుండి విముక్తి కోసం, ఆత్మగౌరవం కోసం జరిగిన పోరాటం. ప్రాణాలకు తెగించి కొట్లాడిన ఉద్యమకారుల త్యాగాలను "బిక్ష"గా చూడటం సరైనది కాదు.ఎన్నికల హామీలు రాజ్యాంగబద్ధమైన హక్కుఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలు కేవలం ఓట్ల కోసం మాత్రమే కావు. అవి ఒక సామాజిక వర్గానికి లేదా బాధ్యతాయుతమైన పౌరులకు ఇచ్చే



భరోసా. ప్రత్యేక రాష్ట్రంలో తమ బతుకులు మారుతాయని ఆశించడంలో తప్పు లేదు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరడం ప్రతి ఉద్యమకారుడి రాజ్యాంగబద్ధమైన హక్కు.
"ప్రభుత్వం ఎంతమందికని ఇవ్వగలుగుతుంది?" అన్న ప్రశ్న తగదు. అసలు ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందే నీళ్లు, నిధులు, నియామకా కోసం.ఉద్యమకారుల పోరాటం వల్లే నేడు రాష్ట్ర ఖజానాకు ఆదాయం వస్తోంది, వేల కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రాష్ట్రం ఏర్పడటానికి మూలకారకులైన వారి సంక్షేమాన్ని చూడాల్సిన బాధ్యత ప్రభుత్వ ంపై ఉంది.న్యాయస్థానాలకు విజ్ఞప్తి:తె లంగాణ ఉద్యమకారులను కేవలం "లబ్ధిదారులు"గా చూడటం మానుకో వాలని, వారు ఈ రాష్ట్ర నిర్మాతలని పాండు రంగా రెడ్డి గుర్తు చేశారు. కోర్టులు చట్టాల ను గౌరవించడమే కాకుండా, ప్రజల సెంటిమెంట్లను మరియు చారిత్రక నేపథ్యాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి చేటు చేస్తాయని, తెలంగాణ సమాజం వీటిని సమర్థించదని ఆయన స్పష్టం చేశారు. న్యాయస్థానాలు, న్యాయమూర్తులు మరియు న్యాయవాదులు ఉద్యమకారులకు అండగా నిలవాలని ఆయన కోరారు.

# రిజిస్ట్రార్ ఆఫీస్ అటెండర్ కే ఇన్ని కోట్లు ఆస్తి ఉంటే..??

**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి రేణిగుంట**

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు రేణిగుంట సబ్ రిజిస్టర్ ఆఫీస్ అటెండర్ తిరుమలేష్ ను ఏసీబీ అధికారులుఅరెస్ట్ చేసి తనిఖీలు నిర్వహించారుతిరుపతి, నెల్లూరు జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో ఏకకాలంగా అధికారులు సోదాలు చేశారు.
ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన కేసులు రేణిగుంట సబ్ రిజిస్టర్ ఆఫీస్ అటెండర్ ను. ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించగా11 ఆస్తి పత్రాలు, 1.47 కేజీలు బంగారం, 8.77 కేజీలు వెండి, 15 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.
మరో రెండు బ్యాంకుల లాకర్లు తేరవాల్సి ఉందని అధికారులు తెలిపారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో 2025 అక్టోబర్ లో అతడు సస్పెండ్ అయినట్లు తెలుస్తుంది..మర్రిపాడు మండలం,డీసీపల్లి లోని తిరుమలేష్ కుటుంబ సభ్యులకు సంబంధింష్త్రచిన ఇళ్లలో గురువారం రెండు బృందాలుగా ఏర్పడి ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించారు





# ప్రజల ఓటే మా విజయ ఆయుధం, బిఆర్ఎస్‌దే గెలుపు పతాకం..!!




**ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ 20వ వార్డులో కౌన్సిలర్ అభ్యర్థి మంద జయ గారితో కలిసి, ఎన్నికల ఇన్చార్జ్ నాగబోయిన భాస్కర్ యాదవ్ గారి నేతృత్వంలో ఈ రోజు జరిగిన ఎలక్షన్ పోలింగ్ సందర్భంగా పోలింగ్ కేంద్రం వద్ద ప్రతి ఓటర్‌కు అండగా నిలిచేలా ఓటర్ స్లిప్స్ లేని వారికి వెంటనే రాసిచ్చి, అవసరమైన సహాయాన్ని అందిస్తూ ఆఖరి క్షణం వరకు ఓర్పు, నిబద్ధత, క్రమశిక్షణతో కార్యకర్తలతో కలిసి దిగ్విజయంగా పనిచేశారు.ఇది గెలుపుకోసం కాదు, ప్రజల హక్కును నిలబెట్టే బాధ్యతగా చేసిన సేవ ఇది బిఆర్ఎస్ శ్రేణుల అంకితభావానికి నిదర్శనం.ఈ మహత్తర సేవలో పాల్గొన్న ప్రతి కార్యకర్తకు హృదయపూర్వక ప్రత్యేక కృతజ్ఞతలు. ఇట్లు,నాగబోయిన భాస్కర్ యాదవ్,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎల్బీనగర్ నియోజకవర్గం.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# రంగారెడ్డి జిల్లా మున్సిపల్ ఎన్నికల ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలి



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి 11:- రంగారెడ్డి జిల్లా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు జరగకుండా, తప్పిదాలకు తవ్వివకుండా, సజావుగా ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు.మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం రంగారెడ్డి జిల్లాలో 6 మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికలు నిర్వహిస్తున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి చేవెళ్ళ మండలంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ నిర్వహణను, ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పోలింగ్ స్టేషన్ ఆవరణలో పోటీ చేయు వార్డు సభ్యుల జాబితాను పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం ఎప్పటికప్పుడు నిర్దేశిత ఫార్మాట్లో నమోదు చేయాలనీ సంబంధిత రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితాలో ఓటర్ల క్రమ సంఖ్య సరి చూసుకొని ఓటింగ్ ప్రక్రియను నిర్వహించాలని ప్రిసైడింగ్ అధికారులకు సూచించారు. పోలింగ్ ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి చిన్న పొరపాట్లుకు తావ్వివకుండా సజావుగా నిర్వహించాలన్నారు. సాయంత్రం 5 గంటల లోపు పోలింగ్ కేంద్రం ఆవరణలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న వారందరికీ ఓటు సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. 5 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రం గేటు లోపలికి ఎవ్వరిని అనుమతించకూడదనీ, ఎలాంటి తప్పిదాలకు తావ్వివకుండా ప్రశాంతగా చేపట్టాలని కలెక్టర్ పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఎన్నికల అధికారులను ఆదేశించారు.

# రూ.32 కోట్లతో కాచిగూడ డివిజన్ అభివృద్ధి

**- బీజేపీ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్**

హైదరాబాద్, ఫిబ్రవరి 11: గత ఐదు సంవత్సరాల కార్పొరేటర్ పాలనలో కాచిగూడ డివిజన్ లో రూ.32కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు డివిజన్ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ తెలిపారు. బుధవారం నింబోలిఅడ్డ లోని బీజేపీ పార్టీ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధి కోసం మరో రూ.5 కోట్ల వరకు ప్రతిపాదనలు చేసి అధికారులకు, ప్రభుత్వానికి పంపించడం జరిగిందని తెలిపారు. డివిజన్ పరిధిలో నారాయణగూడ చౌరస్తాలో మోడల్ మార్కెట్ నిర్మాణం చేపట్టి పూర్తయిందని, త్వరలోనే మార్కెట్ను ప్రారంభించి ప్రజలకు, వ్యాపారులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమె అధికారులను కోరారు. బీజేపీ సికింద్రాబాద్ ఎంపీ, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి, అంబర్పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, సిబ్బందితో కలిసి డివిజన్ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ప్రజలకు ముఖ్యంగా సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, మంచినీటి, డ్రైనేజీ, వర్షపునీటి పైపులైన్ల నిర్మాణం చేపట్టామని, అవసరమైన చోట్ల



పవర్ ?బర్ల ఏర్పాటు చేశామని తెలిపారు. ఐదు సంవత్సరాలుగా తనకు సహకరించిన ప్రజలకు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని సేవలు చేసుకునే అవకాశం ప్రజలు కల్పించాలని ఆమె కోరారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సుభాష్ పటేల్, కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు తంగెడిపల్లి బల్వీర్, ప్రధానకార్యదర్శి ఆర్.సంతోష్, శ్రీరాం సాయికుమార్, వాసు, బి.భీమ్ రాజ్, ఎస్.రవియాదవ్, ఎస్.అరవింద్, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# తోలుపునూరి రమేష్ గౌడ్ ను పరామర్శించిన మాజీ గవర్నర్ బండారి దత్తాత్రేయ

**--మాజీ హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ**

**--బిజెపి ఓ.వి.సి మోర్చా సోషల్ మీడియా కొ కన్వీనర్**

**- మహంకాళి-సికింద్రాబాద్ జిల్లా తోలుపు నూరి రమేష్ గౌడ్**



హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) హైదరాబాద్
మా మాతృమూర్తి తొలుపునూరి ఐలమ్మ ఇటీవల స్వర్గస్థులైన విషయం తెలుసుకుని మాజీ హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్న నేడు కవాడిగూడ డివిజన్ ఉన్ని కోట బస్తి లో వున్న మా నివాసానికి వచ్చి, మాతృవియోగంతో బాధపడుతున్న నన్ను పరామర్శించి మనోధైర్యం చెప్పారు. మా అమ్మ చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే పార్టీ కోసం పనిచేసేవాళ్లను ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాము. పార్టీకి కార్యకర్తలే ముఖ్య కారణమని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలే నవ్వులు నా ధైర్యం అని చెప్పవచ్చారు. బండారు దత్తాత్రేయ ఓదార్పు మాతృభావం మర్చిపోలేని గుర్తింపుఆయనతోపాటు మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ రామ్, సీనియర్ నాయకులు పరిమల్ కుమార్, మాజీ డివిజన్ అధ్యక్షులు మహేందర్ బాబు, డివిజన్ అధ్యక్షులు దిలీప్ యాదవ్, ప్రధాన కార్యదర్శి బొల్లా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి

**- తెలంగాణ విద్యార్థి ఐకాస చైర్మన్ వేముల రామకృష్ణ**



హైదరాబాద్, ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి కాచిగూడ.
ఫిబ్రవరి 11: రాజేంద్రనగర్ హరి హర క్షేత్రం మైదానంలో గత మూడు రోజులుగా క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. పలు ప్రాంతాల నుంచి 33 జట్లు పాల్గొన్నాయి.
మొదటి విజేతగా రాజేంద్రనగర్ కు చెందిన పీకే టీం, రెండో విజేతగా బుద్వేల్ టీం నిలిచాయి..
విజేతలకు తెలంగాణ విద్యార్థి ఐకాస చైర్మన్ వేముల రామకృష్ణ బహుమతులతో పాటు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, సాయి కిరణ్ యాదవ్, ప్రసాద్, సంతోష్, బాలు, ప్రణయ్, చేతన్, అమన్ ,పాపి తదితరులు పాల్గొన్నారు.

# త్రిపుర జర్నలిస్ట్ అసోసియేషన్ మహాసభలకు జాతీయ ఫెడరేషన్ కార్యదర్శి 'పులిపలుపుల'

రాయల్ పోస్ట్ న్యూస్ బ్యూరో హైదరాబాద్ ఫిబ్రవరి 11: రెండు సంవత్సరాలకోసారి జరిగే త్రిపుర వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ మహాసభ ఈనెల ఫిబ్రవరి 14 ,15 తేదీల్లో త్రిపుర రాష్ట్ర రాజధాని కేంద్రం అగర్తలో జరుగనున్నాయి. ఈ సమావేశాలను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రొఫెసర్, డాక్టర్ మాణిక్ సాహ ప్రారంభిస్తారు. త్రిపుర వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ ప్రత్యేక సంచికను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా విడుదల చేస్తారని మహా సభల నిర్వాహకులు త్రిపుర వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు బిజయ్ పాల్ తెలిపారు. మహాసభల ప్రారంభం అనంతరం త్రిపుర కార్మిక శాఖ మంత్రి టింకు రాయి మీడియా వర్క్ షాప్ ను ప్రారంబిస్థారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని కోల్కత్తా కు చెందిన ప్రముఖ జర్నలిస్టులు మధుమిత చక్రవర్తి, త్రిదీప్ భట్టాచార్య లు ఈ సదస్సులో ప్రధాన వక్తలుగా పాల్గొంటారు.త్రిపుర శాసనసభ ఇన్చార్జి సభాపతి రాంప్రసాద్ పాల్ ముఖ్య అతిథిగా పాల్గొని మహాసభల ప్రతినిధుల సభను ప్రారంభిస్తారు.ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుస్ కు అనుబంధంగా పనిచేస్తున్న త్రిపుర వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ తమ రాష్ట్ర మహాసభ సందర్భంగా జాతీయ ఫెడరేషన్ నాయకులను ఆహ్వానించి మహాసభలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి పులిపల్పుల ఆనందం ను గౌరవ అతిథి గా ఆహ్వానించింది. రాష్ట్ర మహాసభల



పర్యవేక్షణకు తగిన సహాయ సహకారాలు అందించేందుకు ఫెడరేషన్ జాతీయ నాయకత్వం కూడా ఆయనను త్రిపుర వెళ్లాలని నిర్దేశించింది.నూతన నాయకత్వాన్ని ఎన్నుకోవడంతో ఈ మహాసభలు ముగుస్తాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ప్రతినిధి బృందం ఒకటి త్రిపుర బయలుదేరి వెళుతుంది. ఈ ప్రతినిధి వర్గంలో ఆయనతోపాటు బండి విజయకుమార్, రామకృష్ణ, వల్లాల జగన్, కుడితాడి బాపూరావు, ఎండి రఫీ, మొఇజ్ బయలుదేరు తున్నారు.
ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సీనియర్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఒక ప్రతినిధి వర్గం త్రిపుర జర్నలిస్టులతో పాటు ఆ రాష్ట్ర గవర్నర్ ఎన్ ఇంద్రసేనారెడ్డిని కలుస్తుంది. జాతీయస్థాయిలో జర్నలిస్టులకు సంక్షేమ నిధిని ఏర్పాటు చేసేందుకు తగినన్ని నిధులు కేటాయించాలని, సీనియర్ జర్నలిస్టుల భద్రతకు జాతీయ స్థాయిలో పెన్షన్స్ పథకం ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ ఒక వినతి పత్రాన్ని కూడా గవర్నర్కు అందజేయనున్నారు. గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి జర్నలిస్టుల సమస్యలను విన్నవించేందుకు గల అవకాశాలను ఈ సందర్భంగా వినియోగించుకోవాలని నిర్ణయించారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు జర్నలిజం విలువలు కాపాడేందుకు, వృత్తి నైపుణ్యాలు పెంచేందుకు చేపట్టాల్సిన చర్యలు, జాతీయస్థాయిలో మీడియా కమిషన్ ఏర్పాటుకు, సంబంధించిన విషయాలు ఈ సందర్భంగా గవర్నర్తో సంప్రదింపులు జరిపి కేంద్ర ప్రభుత్వ దృష్టిని ఆకర్షించేందుకు గల అవకాశాలను వినియోగించుకోవాలని నిర్ణయించారు

# అంతర్ రాష్ట్ర యువజన సమ్మేళనానికి గంగుల రంజిత్ కుమార్ ఎంపిక.



హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) హైదరాబాద్
మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో, మేర యువ భారత్ వరంగల్ సమన్వయంతో మరిపెడ మండలానికి చెందిన గంగుల రంజిత్ కుమార్ ఈ నెల 12 నుండి 16 వరకు కర్ణాటక రాష్ట్రం మంగళూరు లో నిర్వహించనున్న అంతర్ రాష్ట్ర యువజన సమ్మేళన కార్యక్రమంలో పాల్గొననున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల యువత పాల్గొనే ఈ కార్యక్రమం యువతలో జాతీయ ఐక్యత, నాయకత్వ లక్షణాలు మరియు సాంస్కృతిక పరస్పర అవగాహన పెంపొందించడమే ముఖ్య ఉద్దేశ్యం.ఈ విషయాన్ని మేర యువ భారత్ వరంగల్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ ఒక ప్రకటనలో తెలిపారు. గంగుల రంజిత్ కుమార్ ఎంపిక కావడంతో మరిపెడ ప్రాంత ప్రజలు, యువజన సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

# కళ్యాణానికి ముస్తాబవుతున్న శివాలయం

హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి) మండల పరిధిలోని శ్రీ స్వయంభు పార్వతి రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి కళ్యాణ మహోత్సవానికి సిద్ధమవుతుందని ఆలయ అర్చకులు తెలియజేశారు. మహాశివరాత్రి సందర్భంగా అంగరంగ వైభవంగా కళ్యాణం జరపడానికి ఆలయ పరిసరాలను పరిశుభ్రతగా ఉంచుకుంటూ గ్రామ సిబ్బందితో పని చేయించుకుంటూ సర్వం సిద్ధంగా ఉన్నదని తెలియజేశారు.



# సిరిగిరిపురం గ్రామంలో బాధిత కుటుంబాలకు పంచాయతీ పాలకవర్గం అండగా ఉంటామని ఏకగ్రీవం

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం



మహేశ్వరం మండల కేంద్రంలోని సిరిగిరిపురం గ్రామ సర్పంచ్ కృష్ణవేణి శ్రీను మాట్లాడుతూ... గ్రామంలో అనారోగ్య కారణాలవల్ల ఇతర కారణాలవల్ల ఎవరైనా సరే మరణించినట్లయితే గ్రామపంచాయతీ పాలకవర్గం నుంచి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందని పాలకవర్గం ఏకగ్రీవం చేయడం జరిగిందని తెలియజేశారు.. జెల్లెల్ల పుష్పమ్మ అనారోగ్యంతో మరణించడంతో పంచాయతీ పాలకవర్గం కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కృష్ణవేణి శ్రీను మరియు ఉప సర్పంచ్ నాగరాణి మహేష్, వార్డు సభ్యులు.. సత్యనారాయణ చారి, కాసుల ప్రేమలత రవి, ఆవ జంగమ్మ, బండ స్వప్న నరసింహ, గండికోట బాబు, చిట్టే పార్వతాలు, గండికోట ఈదయ్య తదితరులు యొక్క కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది

# స్కూల్ బిల్డింగ్‌పై పడిపోయిన భారీ వృక్షం

'కారేపల్లి, ఫిబ్రవరి 11 : పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా ప్రభుత్వం లక్షలాది రూపాయలు హరితహారం పేరుతో ఖర్చు చేస్తుంటే మరొకవైపు ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాల ఆవరణలో ఉన్న చెట్లను తొలగిస్తున్న వైనం ఇది. చెట్లు తొలగించాలంటే అటవీ శాఖ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక పోయిందనే చందాగా పాఠశాల ప్రహరీ కోసమని పాఠశాల హద్దుపై ఉన్న చెట్టును నరికేస్తే ఆ చెట్టు పూర్తిగా స్కూల్ బిల్డింగ్ పై ఒరిగి స్లాబ్ కు నష్టం చేకూర్చిన ఘటన సింగరేణి మండలం రావోజితండా గ్రామ పంచాయతీలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రావొజీతండా గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల బిల్డింగ్ ఉంది. అయితే స్కూలుకు సంబంధించి ప్రహరీ ఏర్పాటుకు ఇటీవల రూ.5 లక్షలు మంజూరు అయ్యాయి. పాఠశాల హద్దులపై చెట్లు ఉన్నాయి. విద్యార్థులకు చల్లదనం ఉండాలని సంకల్పంతో కొన్ని సంవత్సరాల క్రితం ఆ చెట్లను నాటారు. కాగా గోడ నిర్మాణాన్ని చేపట్టిన వ్యక్తి చెట్లను తొలగించే ప్రక్రియ ప్రారంభించాడు.తాము చెప్పలేదని, అధికారుల అనుమతి తీసుకోవాలని చెప్పినా సంబంధిత వ్యక్తులు వినిపించుకోలేదన్నారు. ఈ విషయమై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అయితే చెట్లు తొలగించిన వ్యక్తి హడావుడిగా గ్రామ పంచాయతీ తీర్మానం చేసినట్లుగా అనుమతి తీసుకోవడం కొసమెరుపు.

05
గురువారం, ఫిబ్రవరి 12, 2026
RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# హైదరాబాద్-తిరుపతి ప్రయాణికులకు రైల్వే గుడ్ న్యూస్ రేపు మాత్రమే

హైదరాబాద్ :హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే ఓ గుడ్ న్యూస్ చెప్పింది. ఈ మార్గంలో ప్రయాణికుల రద్దీ అంతకంతకూ పెరుగుతున్న నేపథ్యంలో రేపు ఓ ప్రత్యేక రైలు నడుపుతోంది. ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో ఇలా ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. అలాగే ఈ రైలు బయల్దేరే సమయాలు, హాల్ట్ లు, ఇతర వివరాలను కూడా ఎక్స్ లో ట్వీట్ చేసింది. కాబట్టి కాచిగూడ నుంచి తిరుపతి వెళ్లే ప్రయాణికులు వీటిని గమనించాల్సి ఉంటుంది.కాచిగూడ నుంచి తిరుపతికి ప్రత్యేక రైలు నంబర్ 07511 ను రేపు (ఫిబ్రవరి 12) న నడపాలని అధికారులు నిర్ణయించారు. ఇది కేవలం వన్ వే ట్రైన్ మాత్రమే. కాచిగూడలో ఈ ఎక్స్ ప్రెస్ రైలు రాత్రి 10.40కి బయలుదేరుతుంది. ఇది మరుసటి రోజు (ఫిబ్రవరి 13)న ఉదయం 10 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. అలాగే ఈ



రైలుకు ఉందా నగర్, షాద్ నగర్, జడ్చర్ల మహబూబ్ నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల్, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, రేణిగుంట స్టేషన్లలో హాల్ట్ లు ఇచ్చారు. ఇందులో థర్డ్ ఏసీ, చైర్ కార్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్ లు ఉంటాయి.కాబట్టి రేపు కాచిగూడ నుంచి తిరుపతికి ప్లాన్ చేసుకునే ప్రయాణికులు టికెట్లు బుక్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఈ మార్గంలో ఇప్పటికే పెరుగుతున్న రద్దీతో ప్రయాణికులకు టికెట్లు అందడం లేదు. దీంతో ఈ ప్రత్యేక రైలును కేవలం ఒకవైపుకే నడుపుతున్నారు. తిరుపతి నుంచి తిరుగు ప్రయాణంలో మాత్రం ప్రస్తుతం బాగానే రైళ్లు అందుబాటులో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు మరికొన్ని ప్రత్యేక రైళ్లను కూడా వివిధ రైల్వే నడుపుతోంది.

# హైదరాబాద్ అరుణాచలం..
## అతి తక్కువ ధరకే బెస్ట్ ప్యాకేజీ..

హైదరాబాద్ :మహా శివరాత్రిని పురస్కరించుకుని అనేకమంది భక్తులు జ్యోతిర్లింగాల దర్శనానికి వెళ్తుంటారు. అలాంటి వారికోసం బెస్ట్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ టూర్ లో భాగంగా తక్కువ ధరకే ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించుకోవచ్చు. ఈ దివ్య దక్షిణ యాత్ర, జ్యోతిర్లింగాల దర్శనం ప్రత్యేక రైలు టూర్ ఫిబ్రవరి 21 నుంచి ప్రారంభం కానుంది. ఈ యాత్ర మొత్తం 7 రాత్రులు, 8 రోజుల పాటు సాగనుంది. ఈ టూర్ లో భాగంగా అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, తిరువనంతపురం, తిరుచ్చి, తంజావూరు వంటి పవిత్ర క్షేత్రాలను దర్శించుకోవచ్చు.



దివ్య దక్షిణ యాత్రలో భాగంగా సికింద్రాబాద్ నుంచి రైలు ప్రారంభం కానుంది. ఈ రైలు టికెట్ వివరాలు చూస్తే పెద్దలకు రూ.14,700 గా ఉంది. అలాగే 5 నుంచి 11 ఏళ్ల పిల్లలకు రూ.13,800ల టికెట్ ధరను అధికారులు నిర్ణయించారు. ఇక కంఫర్ట్ క్లాస్ అయితే పెద్దలకు రూ. 28,700, చిన్నారులకు రూ.27,400 గా నిర్ణయించారు.ఈ టూర్ లో అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేంద్రం, తిరుచ్చి, తంజావూరు.. తదితర ప్రముఖ క్షేత్రాలను సందర్శించే అవకాశం ఉంది. ఇక ఈ పర్యటన మొత్తం 7 రోజులు, 8 రాత్రులుగా ఉంటుంది. ఇందుకు సంబంధించిన రైలు.. సికింద్రాబాద్, జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుంది. ఈ స్టేషన్లలో ఏదైనా స్టేషన్ నుంచి మీరు రైలు ఎక్కే అవకాశం ఉంది.ఇక ఫిబ్రవరి 21న మధ్యాహ్నం 12 గంటలకు సికింద్రాబాద్ నుంచి రైలు స్టార్ట్ అవుతుంది. మరుసటి రోజు ఉదయం 9 గంటల 15 నిమిషాల వరకు అరుణాచలం చేరుకుంటుంది. అక్కడి నుంచి భక్తులు వసతి గృహానికి వెళ్తారు. అనంతరం అరుణాచలం ఆలయాన్ని సందర్శిస్తారు. ఇక మూడో రోజు రామేశ్వరం ఆలయ దర్శనం ఉంటుంది. అలా రాత్రి రామేశ్వరంలోనే బస ఉంటుంది. నాలుగోరోజు రామేశ్వరం నుంచి మధురై వెళ్తారు. ఐదో రోజు రాక్ మెమోరియల్, గాంధీ మండపం, సన్ సెట్ పాయింట్ ను సందర్శిస్తారు. ఇక కన్యాకుమారిలోనే డిన్నర్, రాత్రి బస ఉంటుంది.ఇక ఆరో రోజు త్రివేంద్రం బయలుదేరుతారు. అక్కడ శ్రీ పద్మనాభస్వామి ఆలయం, కోవలం బీచ్ ను సందర్శిస్తారు. ఏడోరోజు బృహదీశ్వర ఆలయాన్ని సందర్శిస్తారు. అలా చివరగా సికింద్రాబాద్ కు తిరుగు ప్రయాణం అవుతారు. తంజావూరు రైల్వే స్టేషన్ లో రాత్రి 8 గంటలకు ట్రైన్ ఉంటుంది. ఎనిమిదో రోజు ప్రయాణంలోనే ఉంటారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కు రాత్రి 9 గంటలకు రైలు చేరుకుంటుంది. దాంతో ఈ టూర్ ముగుస్తుంది. ఇక టూర్ కు సంబంధించిన పూర్తి వివరాల కోసం ఐఆర్‌సీటీసీ టూరిజం అధికారిక వెబ్ సైట్ ను సందర్శించండి.

# ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం గుడ్ న్యూస్

హైదరాబాద్ :ఉద్యోగులకు బిగ్ అప్డేట్. తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆరోగ్య పథకంలో మార్పులకు సిద్ధమైంది. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులకు కొత్త ఆరోగ్య పథకం అమలు చేయనుంది. ఈ కొత్త పథకం పైన ఆరోగ్య శ్రీ ట్రస్టు సీఈవో, ఉన్నతాధికారులు, పలు ఉద్యోగ సంఘాలతో సమావేశం అవ్వాలని నిర్ణయించనున్నారు. పాత పథకంలో ఉన్న పలు లోపాలను సవరించి కొత్త ఆరోగ్య పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది.ప్రభుత్వం తీసుకొస్తున్న ఈ ఆరోగ్య పథకానికి 'న్యూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీం'గా వ్యవహరించాలని నిర్ణయిచారు. ఈ పథకాన్ని అమలు చేసేందుకు ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్ (ఈహెచ్‌సీటీ) ఏర్పాటు కానుంది. అయితే ఇప్పటి వరకు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులకు నగదు రహిత ఆరోగ్య సేవలను రాజీవ్ ఆరోగ్య శ్రీ ట్రస్టు ద్వారా అందిస్తున్నారు. ఈ సేవలు నామమాత్రంగానే ఉన్నాయనే అభిప్రాయం ఉద్యోగుల్లో కనిపిస్తోంది.కాగా, బకాయిలు సరిగా చెల్లించకపోవడంతో ఈహెచ్ఎస్ కార్డులు కొన్నిచోట్ల చెల్లుబాటు కావడం లేదని ఉద్యోగులు ఫిర్యాదులు చేస్తున్నారు. మొదట నగదు చెల్లించి, క్లెయిమ్ చేసుకుంటున్నప్పటికీ మొత్తం నగదు తిరిగి రావడం లేదన వాపోతున్నారు. దీంతో ఉద్యోగులు కాస్త ఇబ్బందులకు గురవుతున్న అంశాన్ని ప్రభుత్వం గుర్తించింది.

# పచ్చని పందిళ్లు.. రంగురంగుల పూలుధ : పోలింగ్ కేంద్రాలా లేక పెళ్లి మండపాలా




వరంగల్:వరంగల్ జిల్లాలోని వర్దన్నపేట మున్సి పాలిటీ పరిధిలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ అత్యంత ఉత్సాహభరితమైన వాతావరణంలో ప్రారంభమైంది. మొత్తం 12 వార్డులకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో ఓటర్లను ఆకర్షించేందుకు అధికారులు వినూత్న ప్రయోగాలు చేశారు. సాధారణంగా పోలింగ్ కేంద్రాలు అంటే కిక్కిరిసిన క్యూ లైన్లు, గంభీరమైన వాతావరణం కనిపిస్తుంది. కానీ ఇక్కడ పర్యావరణ స్పృహను పెంపొందించేలా హరిత పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం విశేషం.పచ్చదనంతో స్వాగతంపోలింగ్ కేంద్రాలన పచ్చని తోరణాలు, రంగురంగుల పూలతో అధికారులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కేవలం అలంకరణకే పరిమితం కాకుండా.. పోలింగ్ కేంద్రం లోపల అంతా పచ్చదనంతో (గ్రీనరీ) నిండిపోయేలా మొక్కలను ఏర్పాటు చేశారు. ఓటు వేసి బయటకు వచ్చే ఓటర్లు తమ జ్ఞాపకాన్ని పదిలపరుచుకునేందుకు ప్రత్యేకంగా 'సెల్ఫీ పాయింట్స్' ఏర్పాటు చేశారు. అందమైన పూలతో అలంకరించిన ఈ పాయింట్ల వద్ద యువత, మహిళా ఓటర్లు ఆసక్తిగా ఫోటోలు దిగుతున్నారు.ఎన్నికల నిర్వహణ కోసం అధికారులు మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 20 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ఈ 12 వార్డుల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి వివిధ పార్టీల నుంచి మొత్తం 50 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మొత్తం 10,526 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉదయం నుంచే ఓటర్లు స్వచ్ఛందంగా తరలివస్తుండటంతో పోలింగ్ కేంద్రాల వద్ద సందడి నెలకొంది.రాజకీయ సమీకరణాలు – భద్రతరాజకీయంగా చూస్తే, ఇక్కడ ప్రధాన పోటీ అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీల మధ్యే నెలకొంది. ఇరు పార్టీల నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో పోలింగ్ సరళిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.
ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించి, పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా పర్యవేక్షిస్తున్నారు.

# 3 కార్పొరేషన్లుగా జీహెచ్ఎంసీ, ఇక రాజధానిగా



హైదరాబాద్ :గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) స్వరూపం మారిపోయింది. నేటి నుంచి మూడు కార్పోరేషన్లుగా గ్రేటర్ కొనసాగనుంది. 300 డివిజన్లకు విస్తరించి మూడు కార్పొరేషన్లుగా విభజించింది. ఈ మూడు కార్పొరేషన్లకు కొత్త కమీషనర్లను నియమించింది. అదే విధంగా ఐఏఎస్ అధికారుల బదిలీల పైన ఉత్తర్వులు జారీ చేసింది. ప్రముఖ భవనాలన్నీ జీహెచ్ఎంసీ పరిధికే వచ్చాయి. రాజధాని నగరంగా జీహెచ్ఎంసీనే కొనసాగనుంది.నేటి నుంచి గ్రేటర్ హైదరాబాద్ మూడు కార్పోరేషన్లుగా కొత్త రూపం సంతరించుకుంది. దీంతో, ఇక నుంచి జీహెచ్ఎంసీతో పాటూ సైబరాబాద్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్లు గా రూపాంతరం చెందాయి. 3 కార్పొరేషన్లకు కమిషనర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా సృజన, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా వినయ్ కృష్ణారెడ్డి నియమితులయ్యారు.అయితే.. గ్రేటర్ కాల పరిమితి పూర్తి కావటంతో మూడు కార్పొరేషన్లకు స్పెషల్ ఆఫీసర్‌గా జయేష్ రంజన్ కు బాధ్యతలు అప్పగించారు. కొత్త పాలకమండలి వచ్చే వరకు స్పెషల్ ఆఫీసర్‌గా జయేష్ రంజన్ కొనసాగనున్నారు. అదే విధంగా మల్కాజ్‌గిరి జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎస్.పంకజ ను నియమించారు. హైదరాబాద్ ఈడీగా సామ్రాట్ అశోక్, సైబరాబాద్ ఈడీగా ఎం.సంతోష్, లోక్‌భవన్ జాయింట్ సెక్రటరీగా కె.కిరణాచారి నియమితులయ్యారు.హైదరాబాద్ మొత్తం డివిజన్ల సంఖ్య 300కు చేరింది. 60 సర్కిళ్లు, 12 జోన్లతో పరిపాలన వ్యవస్థ ఉండనుంది. ఫిబ్రవరి 10న జీహెచ్ఎంసీ పాలకమండలి గడువు కూడా పూర్తైంది. దీంతో ప్రభుత్వం మూడు కార్పొరేషన్ల ఏర్పాటు పూర్తి చేసింది. ఇదే సమయంలో పలువురు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఎస్సీ అభివృద్ధి శాఖ ప్రత్యేక సీఎస్‌గా సవ్యసాచి ఘోష్ నియమితులయ్యారు. గిరిజన సంక్షేమ ప్రత్యేక సీఎస్‌గా సవ్యసాచి ఘోష్ కొనసాగనున్నారు.

# భాగ్యనగరంలో భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు..



హైదరాబాద్, ఫిబ్రవరి 11: హైదరాబాద్ నగరంలో భారీగా గంజాయి రవాణా విక్రయానికి పాల్పడుతున్న నెట్‌వర్క్‌ను పోలీసులు గుట్టురట్టు చేశారు. వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్, ఎస్ఆర్ నగర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో 70 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన గంజాయి విలువ సుమారు రూ.35 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఒడిశాకు చెందిన మనీల్ దలబెహారా, ఇస్మాయిల్ రైతా అనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు.పోలీసుల వివరాల ప్రకారం.. మనీల్ దలబెహారా అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో ఒడిశాలో గంజాయి సాగు చేశాడు. ఆయన పండించిన గంజాయిని హైదరాబాద్‌లో విక్రయించాలని ప్లాన్ చేశాడు. ఈ క్రమంలో మేడ్చల్‌లో నివసిస్తున్న ఒడిశాకు చెందిన ఇస్మాయిల్ సహకారంతో నగరంలో మనీల్ దలబెహారా సరఫరా చేశాడు. ఇస్మాయిల్ ఓ ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తూ.. గంజాయి విక్రయం నిర్వహిస్తున్నట్లు తమ విచారణలో వెల్లడైందని అన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించామని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి 70 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు.. భూసేకరణ షురూ..



హైదరాబాద్, ఫిబ్రవరి 11: మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మూసీ అభివృద్ధికి భూసేకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించింది. ఈ మేరకు మూసీ రివర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. దీని ప్రకారం ఫేజ్ ఏ1లో హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.2 కిలోమీటర్లు, ఫేజ్ ఏ2లో ఉస్మాన్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.8 కిలోమీటర్లు పరిధిలో భూసేకరణ చర్యలు చేపట్టనున్నారు అధికారులు.హైదరాబాద్, గోల్కొండ మండలం, రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పరిధిలో భూముల సేకరణ కోసం నోటిఫికేషన్ జారీ చేశారు. సుమారు 50 ఎకరాలకు పైగా భూమి సేకరించేందుకు ప్రక్రియ ప్రారంభమైంది. భూ యజమానులకు మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం అందించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఆయా యజమానులు తమ హక్కుల పత్రాలు(పట్టాలు, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు) నిర్దేశిత సమయంలో సమర్పించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఏమైనా అభ్యంతరాలుంటే నిర్ణీత సమయంలో తెలియజేయాలని అధికారులు సూచించారు.సర్వే నంబర్లు, గ్రామాల వారీగా పూర్తి జాబితాను కూడా ప్రకటించారు. 2013 నిబంధనల ప్రకారం.. ఈ భూసేకరణ ప్రక్రియను అధికారులు చేపట్టనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, అభివృద్ధి పనులు దశలవారీగా కొనసాగనున్నాయి.

Wanted
MARKETING TEAMS
మార్కెటింగ్ టీం కావలెను
పార్ట్ టైం / ఫుల్ టైం
రిటైర్డ్ ఎంప్లాయిస్, గృహిణులు, జాబ్ లేని వారు, జాబ్ ఉన్న వారు..
స్టూడెంట్స్.. అందరూ అర్హులే.. ఏజ్ లిమిట్ లేదు.. లక్షల్లో ఆదాయం
డబ్బు సంపాదించాలన్న
కసి పట్టుదల ఉన్న ప్రతి ఒక్కరికి ఇదొక
సువర్ణావకాశం
ఒక పేదవాడు ధనవంతుడు అవ్వడానికి
ఉన్న ఏకైక మార్గం రియల్ ఎస్టేట్ మాత్రమే
ఈ గోల్డెన్ అవకాశాన్ని ఉపయోగించుకోండి
అలాగే ఈ నెంబర్ ని సంప్రదించండి
9391662839 / 9392112739

GOVERNMENT OF TELANGANA
తెలంగాణ ప్రభుత్వము
FCDA
Future City
Development Authority
ఈ ఏరియాలో రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ చేయుటకు స్త్రీ పురుషులు మరియు
రిటైర్మెంట్ ఎంప్లాయిస్ ఎల్ఐసి రియల్ ఎస్టేట్ ఫీల్డ్ వర్క్ చేయుటకు 25 ఏళ్ల పైబడిన
బాగా కష్టపడే వ్యక్తులు ఫస్ట్ పెరటిగా తీసుకోబడును చదువు ఉన్న లేకున్నా పరవాలేదు
మిగతా డీటెయిల్స్ కొరకు సంప్రదించండి : 9391662739 ర 9392112739

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
# హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

## లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం.. మార్చి 9వ తేదీన చర్చ..



**న్యూఢిల్లీ:**లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అవిశ్వాస తీర్మానంపై మార్చి 9వ తేదీన చర్చ జరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. స్పీకర్‌ను తొలగించే తీర్మానంపై చర్చ బడ్జెట్ సమావేశాల రెండో భాగం మొదటి రోజు అయిన మార్చి 9న జరిగే అవకాశముందని లోక్‌సభ వర్గాలు తెలిపాయి. కాగా, విపక్షాల నోటీసు నేపథ్యంలో తనపై అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన చర్చ పూర్తయ్యేంత వరకూ సభకు దూరంగా ఉండాలని స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకున్నారు రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో రాహుల్ గాంధీకి స్పీకర్ ఓం బిర్లా అవకాశం ఇవ్వలేదని, నిలదీసిన 8 మంది ఎంపీలను సస్పెండ్ చేశారని విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. అధికార పార్టీకి అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్న స్పీకర్‌ను తొలగించాలని అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ సెక్రటరీకి మంగళవారం కాంగ్రెస్ నోటీసులు అందజేసింది. దీంతో తనపై వచ్చిన అవిశ్వాస తీర్మాన నోటీసును కొట్టివేసే వరకు సభా కార్యకలాపాలకు హాజరు కాకూడదని ఓం బిర్లా నిర్ణయించుకున్నారు. నోటీసును పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సభా ప్రధాన కార్యదర్శిని కూడా ఆయన ఆదేశించారని లోక్‌సభ వర్గాలు తెలిపాయి కాగా, విపక్షానికి చెందిన మహిళా ఎంపీలు దాడికి ప్రయత్నిస్తారనే సమాచారంతో ప్రధాని ప్రసంగం లేదని సభాపతి స్థానం నుంచి ఓం బిర్లా ప్రకటించడం మహిళా ఎంపీలపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసిన బీజేపీ ఎంపీపై స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ క్రమంలో 118 మంది సభ్యుల సంతకాలతో మంగళవారం ఉదయం లోక్‌సభ సెక్రటరీ

## నేను డబ్బా మంత్రిని: కేంద్ర మంత్రి సంచలన వ్యాఖ్యలు



**మధ్యప్రదేశ్ :**కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తన పనితీరుతోనే కాకుండా తన విలక్షణమైన ప్రసంగాలతో కూడా దేశవ్యాప్తంగా గుర్తింపు పొం దారు. తాజాగా మధ్యప్రదేశ్‌లోని అశోక్ నగర్ జిల్లా చందేరీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన చేసిన కామెంట్స్ ప్రేక్షకులను ఆలోచిం పజేయడమే కాకుండా కడుపుబ్బ నవ్వించాయి. ముఖ్యంగా మొబైల్ వాడకం వల్ల పెరుగుతున్న దూరాల గురించి మాట్లాడుతూ ఆయన తనను తాను డబ్బా మంత్రి అని పిలుచుకోవడం హాట్ టాపిక్ అయ్యింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మం త్రి జ్యోతిరాదిత్య సింధియా ప్రసంగిస్తూ.. నేటి కాలంలో మొబైల్ ఫోన్లు అతిగా వాడకం వల్ల మనుషుల మధ్య సంబంధాలు ఎలా దెబ్బతింటున్నాయో వివరించారు. "నేను ఎక్కడ చూసినా వేదిక మీద ఉన్నవారు, కింద కూర్చున్న వారు, కారులో, విమానంలో.. ఇలా ఎక్కడ ఐదుగురు కూర్చున్నా ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం లేదు. అందరూ తమ తమ డబ్బా(మొబైల్)లలో బందీలైపోయారు. ఎవరి డబ్బాలో వారు మస్తుగా ఉంటున్నారు." అని వ్యాఖ్యానించారు. భార్యాభర్తల మధ్య పెరిగిన దూరంబంధాల గురించి ఆయన మరింత లోతుగా మాట్లాడుతూ.. "చివరికి భార్యాభర్తలు కూడా ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం లేదు. భర్త తన డబ్బాలో, భార్య తన డబ్బాలో మునిగిపోతున్నారు. ఇలాగైతే ఇక రిలేషన్స్ ఎలా ఏర్పడతాయి" అని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే ఆయన నవ్వుతూ.. "నేను డబ్బా మంత్రిని(టెలికాం మంత్రిని). ఆ డబ్బాలను ఎంత ఎక్కువగా వాడితే నాకు అంత మంచిది. కానీ మానవ సంబంధాల దృష్ట్యా ఇది ఆందోళనకరం" అని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా చమత్కరించారు. జ్యోతిరాదిత్య సింధియా విన్నపంప్రస్తుతం మోదీ క్యాబినెట్‌లో టెలికాం మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న జ్యోతిరాదిత్య సింధియా, దేశంలో 5జీ నెట్‌వర్క్ విస్తరణకు, అనేక నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితే సాంకేతికత ఎంత పెరిగినా.. కనీసం భోజనం చేసేటప్పుడైనా కుటుంబ సభ్యులందరూ మొబైళ్లను పక్కన పెట్టి ఒకరితో ఒకరు మాట్లాడుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జీవితంలో అన్నిటికంటే పెద్ద ఆస్తి 'బంధాలే' అని ఆయన గుర్తు చేశారు. మంత్రి హోదాలో ఉండి కూడా తన శాఖను 'డబ్బా' అని సంబోధిస్తూ, అందులోని ప్రతికూలతలను ధైర్యంగా చెప్పిన సింధియా శైలిని నెటిజన్లు మెచ్చుకుంటున్నారు.

## అదానీ పరువు నష్టం కేసు.. జర్నలిస్టుకు జైలు శిక్ష




**హైదరాబాద్ :**అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ దాఖలు చేసిన క్రిమినల్ పరువు నష్టం కేసులో జర్నలిస్ట్ రవి నాయర్‌ను గాంధీనగర్‌లోని మాన్సా మేజిస్ట్రేట్ కోర్టు దోషిగా నిర్ధారించింది. ఈ కేసులో రవి నాయర్‌కు ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు జరిమానా విధించింది. అదానీ గ్రూప్ ప్రధాన సంస్థ అయిన అదానీ ఎంట ర్‌ప్రైజెస్ లిమిటెడ్.. రవి నాయర్ తప్పుడు, పరువు నష్టం కలిగించే ట్వీట్లను పోస్ట్ చేసి కంపెనీ ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్ని ంచారని ఆరోపించింది. ఈ ఫిర్యాదు ఆధార ంగానే కేసు నమోదు కాగా, న్యాయస్థానం పూర్తి విచారణ చేపట్టింది. రవి నాయర్ పోస్టులు కేవలం అభిప్రాయ స్వేచ్ఛకు మించి, ప్రజలు, పెట్టుబ డిదారులలో కంపెనీ విశ్వసనీయతను దెబ్బతీసే ఉద్దేశంతో ఉన్నాయని అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ వాదించింది. విచారణ అనంతరం కోర్టు, అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ తన కేసును నిరూపించిందని నిర్ధారిస్తూ, రవి నాయర్‌ను క్రిమినల్ పరువు నష్టం నిబంధనల కింద దోషిగా తేల్చింది. తీర్పులో భాగంగా, నాయర్‌కు ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు ఆర్థిక జరిమానా వేశారు. జరిమానా మొత్తం వివరాలు అధికారికంగా వెల్లడి కానప్పటికీ, జైలు శిక్షతో పాటు నగదు జరిమానా తప్పనిసరిగా విధించినట్లు పలు నివేదికలు పేర్కొంటున్నాయి. కార్పొరేట్, విధానపరమైన అంశాలపై తన విశ్లేషణలకు సుపరిచితుడైన స్వతంత్ర జర్నలిస్ట్ రవి నాయర్, ఈ తీర్పుపై వెంటనే స్పందించలేకపోయారు. భారతదేశంలో మీడియా వ్యక్తులు, కార్పొరేట్ సంస్థల మధ్య హై-ప్రొఫైల్ పరువు నష్టం కేసుల పట్ల పెరుగుతున్న న్యాయ, ప్రజా పరిశీలనల మధ్య ఈ శిక్ష ప్రాముఖ్యత సంతరించుకుంది.

## ఎస్సీ-ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీ లేయర్ : కేంద్రానికి సుప్రీంకోర్టు 'డెడ్ లైన్'



**న్యూఢిల్లీ:**దేశంలో ఎస్సీ-ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ, ఆ వర్గాల్లోని ఆర్థికంగా స్థిరపడిన వారిని(క్రీమీ లేయర్) రిజర్వేషన్ల నుంచి మినహా యించడంపై సుప్రీంకోర్టు మరోసారి క్రియాశీలక పాత్ర పోషిస్తోంది. ఎస్సీ-ఎస్టీ రిజర్వేషన్ల ప్రయోజనాలు నిజమైన లబ్ధిదారు లకు అందేలా చూడాలని.. క్రీమీ లేయర్‌ను మినహాయి ంచాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై స్పందించిన ధర్మాసనం.. దీనిపై తమ నివేదిక సమర్పించాలని కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. రాజ్యాంగ ధర్మాసన తీర్పుపై ఆరాజస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కేసును విచారించింది. 2024లో ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఎస్సీ-ఎస్టీ రిజర్వేషన్లను ఉప-వర్గాలుగా విభజించేందుకు (కోటాలో కోటా) అనుమతినిస్తూ చారిత్రాత్మక తీర్పునిచ్చింది. ఆ తీర్పు వెలువడిన తర్వాత కేంద్ర సర్కారు క్రీమీ లేయర్ అమలుపై లేదా వర్గీకరణపై తీసుకున్న చర్యలు ఏమిటని సుప్రీంకోర్టు మంగళవారం ప్రశ్నించింది. పిటిషనర్ల వాదనలు.. డిమాండ్లుఓపీ శుక్లా, 'సమతా ఆందోళన్ సమితి' ఈ పిటిషన్లను దాఖలు చేశాయి. రిజర్వేషన్ల ఫలాలు కేవలం ఒకే వర్గానికి లేదా ఆ వర్గాల్లోని సంపన్నులకే పరిమితం కాకుండా.. అత్యంత వెనుకబడిన ఉప-కులాలకు చేరాలని వారు వాదించారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో వివిధ ఉప-కులాల ప్రాతినిధ్యంపై స్పష్టమైన డేటాను సేకరించాలని.. అలాగే క్రీమీ లేయర్‌ను గుర్తించేందుకు అవసరమైన ప్రమాణాలను నిర్ణయించాలని పిటిషనర్లు కోర్టును కోరారు. వర్గీకరణపై స్పష్టమైన నిబంధనలుఆగస్టు 2024 నాటి తీర్పులో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాలకు ఎస్సీ-ఎస్టీలను వర్గీకరించే అధికారం ఇచ్చింది. అయితే ఈ ప్రక్రియ ఏకపక్షంగా ఉండకూడదని, రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా శాస్త్రీయ ఆధారం, తగిన డేటా ఆధారంగానే వర్గీకరణ జరగాలని స్పష్టం చేసింది. అంతేకాకుండా ఓబీసీ తరహాలోనే ఎస్సీ-ఎస్టీ రిజర్వేషన్లలో కూడా క్రీమీ లేయర్ అమలును పరిశీలించాల్సిన అవసరం ఉందని అప్పట్లోనే అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. కేంద్రం ఇచ్చే వివరణపై ఉత్కంఠప్రస్తుతానికి కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై తన వివరణ ఇవ్వాలని ఆదేశించిన సుప్రీంకోర్టు.. తదుపరి విచారణను కొద్ది రోజులు వాయిదా వేసింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సమాధానం, గణాంకాల ఆధారంగానే ఎస్సీ-ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీ లేయర్ అమలుపై ఒక తుది నిర్ణయం వచ్చే అవకాశం ఉంది.

## డబ్బా ఇంజిన్: ఆ ఒక్క మాటతో..




**తమిళనాడు :**త్వరలో అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొనబోతోంది తమిళనాడు. ఈ నేపథ్యంలో ఇప్పటి నుంచే రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఈసారి ఎన్నికల బరిలో తమిళగ వెట్రి కజగం అధినేత విజయ్ అడుగు పెడుతున్నందున అందరి దృష్టి ఆయనపైనే ఉంది. విజయ్ రాకతో త్రిముఖ పోటీ నెలకొంది. అధికారాన్ని నిలబెట్టుకోవడానికి డీఎంకే.. ఈ పార్టీని గద్దె దింప డానికి ఏఐఏడీఎంకే ఇప్పటికే హోరాహోరి పోరు సాగిస్తోన్నాయి. ఈ పరి ణామాల మధ్య చెన్నైలో ఇండియా టుడే నిర్వహించిన తమిళ నాడు రౌండ్‌టేబుల్ సమావేశంలో ముఖ్య మంత్రి ఎంకే స్టాలిన్ పాల్గొన్నారు. పలు అం శాలపై మాట్లాడారు. డీఎంకే సవాళ్లు, రాహుల్ గాంధీతో సత్సంబంధాలు, కాంగ్రెస్‌తో పొత్తు/ సీట్ల పంపకాల గురించి ప్రస్తావించారు. కేంద్ర ంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ సంకీర్ణ కూటమిపై ఘాటు విమర్శలు గుప్పించారు. డీఎంకే సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు కొనసాగుతుందని తేల్చి చెప్పారు. విభేదాల వార్తలను ఖండించారు. రాహుల్ గాంధీతో తనకు సోదర అనుబంధం ఉందని స్టాలిన్ పేర్కొన్నారు. తన సొంత తమ్ముడిగా భావిస్తానని ఆయన వ్యాఖ్యానిచారు. ఈ సారి అధికారంలోకి వస్తే కాంగ్రెస్‌కు కేటాయించాల్సిన మంత్రి పదవులపై స్పష్టత ఇవ్వలేదు గానీ.. 2021 కంటే కూడా మరింత పురోగతి సాధిస్తామని తేల్చి చెప్పారు. తమిళనాడులో డీఎంకే-కాంగ్రెస్ కూటమి బలంగా ఉందని, తాము కలిసే ఈ ఎన్నికలలో పోటీ చేస్తామనీ స్పష్టం చేశారు. ప్రభుత్వంలో అధికార పంపకం ప్రశ్న ప్రస్తుతానికి తలెత్తదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్టాలిన్ ఎన్డీఏను తీవ్రంగా విమర్శించారు. బీజేపీది "డబుల్ ఇంజిన్" కాదని, "డబ్బా ఇంజిన్" అని ఎద్దేవా చేశారు. ఈ ఎన్నికలు "ఆర్యులు-ద్రవిడుల మధ్య యుద్ధం"గా అభివర్ణించారు. తప్పుడు సమాచారం, ద్వేషం, మత ఉద్రిక్తతలను బీజేపీ వ్యాపింపజేస్తోందని ఆరోపించారు. మైనారిటీలతో విభేదాలను పెంచడానికి ఎన్డీఏ ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. తమిళనాడులో మత రాజకీయాలకు స్థానం లేదని స్పష్టం చేశారు. 2021 ఎన్నికల్లో డీఎంకే 133 స్థానాలు గెలుచుకుంది. సొంతంగా అధికారం చేపట్టింది. కాంగ్రెస్ 18 సీట్లు గెలుచుకున్నా కూడా.. మంత్రి పదవులు దక్కలేదు. కాంగ్రెస్‌కు బెర్తులను కేటాయించడానికి పెద్దగా ఇష్టపడలేదు స్టాలిన్. ఇది ఈ రెండు పార్టీల మధ్య విభేదాలకు దారి తీసింది. కాంగ్రెస్ ఈసారి గట్టిగా బేరం ఆడుతోంది. రాష్ట్రంలో డీఎంకే తమను అణచివేస్తోందని ఆరోపిస్తోంది.

## రేపు భారత్ బంద్: నిలిచిపోనున్న రవాణా విద్యా సంస్థలు, బ్యాంకులు



**హైదరాబాద్ :**భారత్ బంద్ కు పలు సంఘాలు నిర్ణయి ంచాయి. రేపు (గురువారం) భారత్ బంద్ నిర్వహించాలని కార్మిక, రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. రవాణా వ్యవస్థ నిలిచిపోనుంది. ఆటో డ్రైవర్ల సంఘాలు బంద్ కు మద్దతు ప్రకటించాయి. అమెరికాతో వాణిజ్య ఒప్పందం.. లేబర్ యాక్టులకు నిరసనగా దేశ వ్యాప్తంగా బంద్ కు నిర్ణయం తీసుకున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని కార్మిక - రైతు సంఘాలు ఈ బంద్ కు మద్దతు ప్రకటించాయి. బ్యాంకుల పైన ప్రభావం పడే అవకాశం ఉంది. విద్యా సంస్థల పైనా బంద్ ఎఫెక్ట్ పడే అవకాశం కనిపిస్తోంది. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని నిరసిస్తూ ఈ నెల 12న భారత్ బంద్ నిర్వహించాలని రైతు సంఘం సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) పిలుపునిచ్చింది. ఆ సంఘం కన్వీనర్ హన్నన్ మొల్లా మీడియాతో మాట్లాడుతూ రెండు దేశాల వాణిజ్య ఒప్పందం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది భారత రైతులపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. అమెరికా నేర్పరితనానికి భారత ప్రభుత్వం లొంగిపో యిందని ఆయన ఆరోపించారు. ఈ నెల 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తెలుగు రాష్ట్రాల్లోని వామపక్ష పార్టీల నేతలు పిలుపునిచ్చాయి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరిస్తుందని, నరేంద్ర మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు 3 లేబర్కోడ్లను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ - చట్టం- 2025, వీబీజి రామ్ జీ చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్ ఐసీలో 100శాతం విదేశీ పెట్టు బడులకు అనుమతించడం వంటి ప్రజావ్యతిరేక విధానాలను ఉపసం హరించుకోవాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాలు ఈ బంద్ కు పిలుపునిచ్చాయి. నిలిచిపోనున్న రవాణా వ్యవస్థతెలుగు రాష్ట్రాల్లో వామపక్ష పార్టీలు.. కార్మిక, విద్యార్థి అనుబంధం సం ఘాలు బంద్ కు మద్దతు ప్రకటించాయి. ఇదే సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని తెలంగాణ ఆటో, ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వెంకటేశం ఆరోపించారు. కార్మికుల నడ్డివిరిచే దుర్మార్గమైన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు పిలుపు నిచ్చారు.

## వందే మాతరం గీతంపై కేంద్రం సంచలనం.. ఇకపై ఇదే




**హైదరాబాద్ :**నరనరాల్లో దేశభక్తిని ఉప్పొంగింపజేసే వందే మాతరం గీతంపై కొత్త మార్గదర్శకాలు జారీ అయ్యాయి. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వీటిని విడుదల చేసింది. సరైన మర్యాదను పాటిస్తూ గౌరవం ఇచ్చేలా మార్గదర్శకాలు ఉన్నాయి. ఈ గీతానికి సంబంధించిన అధికారిక వర్షన్ ఆలపించేటప్పుడు గానీ, వినిపించేటప్పుడు గానీ ఇకపై లేచి నిల్చోవడం తప్ప నిసరి. శ్రోతలు అటెన్షన్‌లో లేచి నిల్చోవాలి. సామూహిక గీతాలాపనతో పాటు దీని పఠనం తప్పకుండా ఉండాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తాజాగా ఆదేశి ంచింది. సినిమా హాళ్లలో న్యూస్‌రీల్స్ లేదా డాక్యుమెంటరీల సమయంలో ఇది ప్లే అయితే నిలబడాల్సిన అవసరం లేదు. అలాగే వందే మాతరంతో పాటు జనగణమన అధినాయక జయహే.. జాతీయ గీతం రెండింటినీ పాడాల్సి వచ్చిన సందర్భంలో అను సరించాల్సిన విధి విధా నాలు కూడా ఇందులో ఉన్నాయి. జనగణమన కంటే వందేమాతరాన్ని ముందుగా ఆలపించడం తప్పనిసరి అని ఈ మార్గదర్శకాలు స్పష్టం చేశాయి. 1937లో తొలగించిన నాలుగు చరణాలతో సహా వందేమాతరం ఆరు చరణా లనూ కూడా పూర్తిగా ఆలపించాల్సి ఉంటుంది ఇకపై. అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ అవార్డుల ప్రదానోత్సవం వేడుకలతో పాటు రాజ్యాంగాధిపతి అయిన రాష్ట్రపతి హాజరయ్యే అన్ని కార్యక్రమాలలోనూ వందేమాతరం గీతా న్ని పూర్తిగా వినిపించాల్సి ఉంటుంది. రాష్ట్ర పతి రాక, నిష్క్రమణ వేళలు పాఠశాలల్లో విద్యా ర్థు లలో జాతీయ గేయం, వందేమాతరం గీతం, జెండా ఎ ట్ల గౌరవం పెంపొందించే ఏర్పాట్లు చేయాలనిమార్గదర్శకాల్లో

Printed, Published & Owned by BATTU LAXMI NARAYANA ; Printed at BATTU PRINTERS, PLOT NO 30 .ROAD NO 2. MADHRA NAGAR. MANSURABAD .LBNAGAR R R DIST., TELANGANA,
Published from BATTU.PUBLICATIONS, H.NO PLOT NO 30 .ROAD NO 2. MADHRA NAGAR. MANSURABAD .LBNAGAR, R R DIST. Editor: BATTU LAXMI NARAYANA, CELL:9951693876